JEE ADVANCED 2026
ఆలిండియా ఓపెన్ కేటగిరీలో
100 లోపు 35 ర్యాంకులు
శ్రీచైతన్య విద్యాసంస్థలు

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
epaper.vaartha.com WWW.VAARTHA.COM
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
3-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 123 పేజీలు: 10+4 వెల: 6.50

JEE ADVANCED 2026
ఆలిండియా ఓపెన్ కేటగిరీ
1000 లోపు 201 ర్యాంకులు
శ్రీచైతన్య విద్యాసంస్థలు




ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 100లోపు 35 ర్యాంకులు

RANK 21 YAJAT SHINGHAL HT. NO. 267020175
RANK 26 PASALA MOHITH HT. NO. 266060100
RANK 28 MUKKARA SAKETH HT. NO. 266059154
RANK 31 B SAMEERAJ REDDY HT. NO. 266131323
RANK 36 ARNAV GANDHI HT. NO. 267013646
RANK 37 ADITYA SINGH HT. NO. 261037065
RANK 38 B V C SEKHAR REDDY HT. NO. 266060225
RANK 40 KATA HIMAKAR HT. NO. 266009152
RANK 45 AARUSH SINGHAL HT. NO. 267015167
RANK 56 CHINNI PAWAN TEJA HT. NO. 266060479
RANK 62 K SAMITH CHOWDARY HT. NO. 266062106
RANK 64 U VENKATA YOGESH HT. NO. 266009162
RANK 66 J R MANIDEEP REDDY HT. NO. 266009143
RANK 67 TANMAY H.G HT. NO. 261043005
RANK 73 PALASH JAMBURE HT. NO. 261114121
RANK 74 RAM NIKIL PUVVADI HT. NO. 261048073
RANK 81 ADITYA GUPTA HT. NO. 267010589
RANK 87 NAIDU LAKSHMI TEJAL HT. NO. 266032030
RANK 91 S T VATHSAN HT. NO. 266097453
RANK 92 I ABHISHEK KANTH HT. NO. 266055215
RANK 93 PATURI JAYADEV HT. NO. 266009028
RANK 95 VAKA AVINASH NAIDU HT. NO. 266058086

RANK 10 DARSH SIKKA HT. NO. 262105093*
RANK 17 AARAV GUPTA HT. NO. 266100595*
RANK 30 AMRIT RAJ HT. NO. 267043075*
RANK 41 SNEHAL RAI CHOWDARY HT. NO. 266103545*
RANK 44 YASH YADAV HT. NO. 262067130*
RANK 52 YASHWARDHAN HT. NO. 267011368*
RANK 59 A SUSHANT KUMAR HT. NO. 262007260*
DLP/ONLINE/AITS*
ఇలాంటి మరెన్నో ర్యాంకులు

ఆలిండియా ఓపెన్ కేటగిరీ

| 100 లోపు | 500 లోపు | 1000 లోపు |
|---|---|---|
| 35 ర్యాంకులు | 126 ర్యాంకులు | 201 ర్యాంకులు |

ఆలిండియా ఆల్ కేటగిరీ

| 10 లోపు | 100 లోపు | 500 లోపు | 1000 లోపు |
|---|---|---|---|
| 10 ర్యాంకులు | 93 ర్యాంకులు | 412 ర్యాంకులు | 827 ర్యాంకులు |

వివిధ కేటగిరీల్లో శ్రీచైతన్య సాధించిన ర్యాంకులు
4,431+

Sri Chaitanya Educational Institutions INDIA
శ్రీచైతన్య విద్యాసంస్థలు

IIT-JEE & NEET LONG-TERM 2027 అడ్మిషన్లు జరుగుచున్నవి » Ph: 040 66 06 06 06 | www.srichaitanya.net
*T & C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

మాటల్ గత వారంరోజులపై విశ్లేషణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

3-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 123 పేజీలు: 10+4 వెల: 6.50



రాష్ట్రవ్యాప్తంగా 91 మంది ఖైదీలు విడుదల 5

సిడబ్ల్యుసికి సిద్ధరామయ్య నేడు డికె పదవీప్రమాణం 8





# సంక్షేమంలో టాపర్

## రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా మారుస్తాం

రూ. 22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం

రైతు సంక్షేమానికి రూ. 1,56,496 కోట్లు ఖర్చు చేశాం

**పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సిఎం రేవంత్**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్2:** అభివృద్ధితో పాటు సంక్షేమానికి సమపాళ్లలో ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నాం అని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవాకం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ఆయన ప్రసంగించారు. ప్రతి ఏటా త్యాగాల చరిత్రను స్మరిస్తూ, రేపటి భవిష్యత్‌కు దిశానిర్దేశం చేసుకునే ఒక భావోద్వేగ సందర్భం జూన్ 2, మనం కలలు కన్న స్వరాష్ట్ర స్వప్నాన్ని నిజం చేసిన ఆనాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్, నాటి యుపిఎ ఛైర్ పర్సన్ సోనియాగాంధీలకు తెలంగాణ సమాజం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 7, 2023న బాధ్యతలు స్వీకరించిన క్షణం నుండి ప్రతిక్షణం తెలంగాణ హితమే పరమార్థంగా, రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా, పేదరికం నిర్మూలనే ప్రాధాన్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందన్నారు.రాష్ట్రంలో అధికారం ఇవ్వడంతో పాటు, ఈరెండున్నరేళ్లలో జరిగిన పలు ఉపఎన్నికల్లో, పంచాయతీ,మున్సిపల్ ఎన్నికల్లో మాపట్ల మీరుచూపించిన ఆదరణ, అభిమానం మరువలేనిది.

>>7



మంగళవారం సికింద్రాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్



ఖమ్మంలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో డి.సిఎం భట్టి

## మూడు ప్రధాన లక్ష్యాలతో ముున్ముందుకు తెలంగాణ

1.15 కోట్ల కుటుంబాలకు 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా'

గృహజ్యోతి ద్వారా 2.50 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్

**రాష్ట్ర అవతరణ దినోత్సవంలో డి.సిఎం భట్టి**

**ఖమ్మం బ్యూరో,ప్రభాతవార్త:** సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన లక్ష్యాలతో తెలంగాణ ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు.తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉదయం పెవిలియన్ గ్రౌండ్ వద్ద నున్న అమరవీరుల స్థూపం వద్ద జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి నివాళులు అర్పించి, పోలీస్ పరేడ్ గ్రౌండ్ కు విచ్చేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసు కవాతు నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కమల్లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రస్తుతం 200 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు, 2047 నాటికి మూడు ట్రిలియన్ అమెరికన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున జీవిత బీమా రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ

>>7



## సిబిఎస్ఇ కొత్తచైర్మన్‌గా ప్రశాంత్ సీతారామ్

కార్యదర్శిగా భరద్వాజ్

**న్యూఢిల్లీ, జూన్ 2:** కేంద్ర మాధ్యమిక విద్యాబోర్డు సిబిఎస్ఇకి కొత్త ఛైర్మన్‌ను కేంద్రం నియమించింది.సీనియర్ ఐఎఎస్ అధికారి ప్రశాంత్ సీతారామ్ లోఖండేను కొత్తఛైర్మన్‌గా నియమించారు. అంతకు ముందు లోఖండే 2001 గ్మట్ కేడర్ అధికారి. కేంద్రహోంశాఖలో అదనపు కార్యదర్శిగాపనిచేసారు. ప్రస్తుత ఛైర్మన్ రాహుల్‌సింగ్ స్థానంలో లోఖండే నియమితులయ్యారు. రాహుల్‌సింగ్‌ను వ్యవసాయ శాఖలో అదనపు కార్యదర్శిగా నియమించారు. అలాగే కార్యదర్శిగా భరద్వాజ్‌ను నియమించారు. ప్రస్తుత కార్యదర్శి హిమాంశు గుప్తాస్థానంలో ఆయన్నునియమించారు.గుప్తాను ఆయన మాతృ శాఖ హోంమంత్రిత్వశాఖకే తిరిగి పంపించారు. సిబిఎస్ఇ కొత్తగా ప్రవేశపెట్టిన ఒఎస్ఎం వ్యవస్థను ఏకసభ్య కమిటీ పరిశీలనచేస్తోంది. సత్వరమే తన నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు కసరత్తుచేస్తోంది. 12వ తరగతి పరీక్షలకు డిజిటల్ మదింపు పద్ధతిని బోర్డుప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో గణకులు అన్సర్ షీట్ స్కాన్ కాపీలు పరిశీలనచేస్తారు. ఒఎస్ఎం వ్యవస్థలో ఎదురయిన తుపాను కారణంగా వైదొలిగిన ఛైర్మన్, కార్యదర్శుల స్థానంలో కొత్త అధికారులను నియమించి కేంద్రం ప్రక్షాళనకు శ్రీకారంచుట్టింది.ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఒఎస్ఎం) వివాదంలో అవకతవకలు, లోపాలు ఉన్నాయనే ఆరోపణలపై విద్యార్థులు,

>>7

# మీ అయ్య జాగీరా?

ఇక్కడి నుంచి పోటీ చేస్తాం..



## జనసేన తెలంగాణలోనూ ఉంటుంది..

రాహుల్, ప్రియాంక దక్షిణాదికి రాలేదా?

ఎవరి బెదిరింపులకు భయపడను

**నా వెనుక కెసిఆర్, రేవంత్ లేరు**

కబ్జా నిరూపిస్తే సర్కార్‌కు రాసిస్తా

**తెలంగాణను వ్యతిరేకించినవాళ్లే ఇప్పుడు పదవుల్లో ఉన్నారు..**

**మీడియాతో ఎపి డి.సిఎం పవన్**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 2, ప్రభాతవార్త:** తెలంగాణాలో జనసేన ఉంటుందని, ఇక్కడి నుంచి పోటీ చేస్తామని, అవసరమైతే తెలంగాణలో తాను పర్యటిస్తానని జనసేన అధినేత, ఏపి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. 2029 ఎన్నికల్లో తెలంగాణాలో తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. తెలంగాణాలో ప్రతి సమస్య మీద మాట్లాడుతానని, ప్రతి అన్యాయాన్ని ఎదుర్కొంటామన్నారు. తెలంగాణ భారతదేశంలో అంతర్భాగంగా ఉందని, బెదిరిస్తే భయపడమని అన్నారు. తెలంగాణాను వ్యతిరేకించిన వారే పదవుల్లో కూర్చొన్నారని, వ్యతిరేకించిన వారు ఎమ్మెల్యే అయ్యారని అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికి రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణాపై తనకు ఎంతో ప్రేమ ఉందని, అది రాజకీయాలకు అతీతమైందని ఆయన స్పష్టం చేశారు. తెంలగాణ ప్రజలు తనకు ఎన్నోసార్లు అండగాద నిలిచారన్నారు. ఈ మధ్యన హైదరాబాద్‌లో ఎలా అడుగు పెడుతావు అని, ఇక్కడ నీకే పని అని కొందరు అంటున్నారని అసలు నన్ను అనడానికి, బెదిరించడానికి మీరెవరయ్యా అంటూ ప్రశ్నించారు. బెదిరించే వాళ్ల అయ్య

>>7

# మా అయ్య జాగీరే

4 కోట్ల ప్రజల జాగీరు ఇది



## ఆంధ్రలోనే దిక్కులేదు.. ఇక్కడ పోటీయా?

**మైండ్‌సెట్‌లో మార్పురావాలి**

**తెలంగాణను అవమానించి వక్రభాష్యాలా?**

నవనిర్మాణ సభ పెట్టి ఏం చేయగలరు?

12 యేళ్లుగా లేని విభేదాలు తేవద్దు..

తెలంగాణపై అక్కసు కక్కితే సహించం

**మీడియాతో మంత్రి పొన్నం ప్రభాకర్**

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 2:** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫైర్ అయ్యారు. మిస్టర్ పవన్ కళ్యాణ్ తెలంగాణ మా అయ్యా జాగీరే అని.. ఇది 4 కోట్ల తెలంగాణ ప్రజల జాగీరని అన్నారు. తెలంగాణ నీ అయ్యా జాగీర్ కాదని.. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం సాయంత్రం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రాలో దిక్కు లేదు, గతంలో ఒక్క సీటు రాలేదని, డిపాజిట్ గల్లంతు అయిందన్నారు. ఇప్పుడు బీజేపీ, టీడీపీతో పొత్తుపెట్టుకున్న జనసేన కలిసి పోటీ చేస్తే గెలిచారన్నారు. నాకు ఆంధ్రాలోనే దిక్కు లేదు.. ఇక్కడ ముఖ్యమంత్రి అవుతారా అని పవన్ కళ్యాణే చెప్పారని గుర్తు చేశారు. విడిపోయి కలిసిందామని మా నినాదమని, గత 12 సంవత్సరాల్లో ఎక్కడ విబేధాలు లేకుండా విడిపోయి కలిసి ఉన్నామన్నారు. చనిపోయిన గద్దర్ గురించి మాట్లాడుతూ.. తాను కారు కొనిచ్చానని చెప్తున్నాడని, తెలంగాణలో ఉన్న దళిత వర్గాలు దీనిపై ఆలోచన చేయాలన్నారు. పవన్ కళ్యాణ్ అహంకారమని, తాము ఏ అహంకారానికి వ్యతిరేకంగా పోరాడమని, మా మీద ఏ దూరంకారం ఆదిపత్యం చెలాయించవద్దని కోరుకున్నామన్నారు. రాజకీయంగా ప్రజాస్వామ్యంలో భారతదేశంలో

>>7

# సజావుగా'సర్'

ఇప్పటి దాకా సగంపైగా మ్యాపింగ్ పూర్తి

**గణన ఫారాలపై ఓటర్లకు అవగాహన పెంచుతున్నాం**

**ఇసి అధికారులతో సిఇఒ సుదర్శన్‌రెడ్డి సమీక్ష**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్2:** దేశవ్యాప్తంగా ఓటరు జాబితాను ప్రక్షాళన చేసేందుకు భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) మూడో దశ ప్రక్రియను తెలంగాణ రాష్ట్రంలో పకడ్బందీగా నిర్వహించేందుకు హైదరాబాద్‌లో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, ఉప కార్యదర్శి సంజయ్ కుమార్ నేతృత్వం వహించారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి (డిఈఓ), హైదరాబాద్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అలాగే హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల ఎన్నికల అధికారులు (ఇఆర్ఓ), సహాయ ఎన్నికల నమోదు అధికారులు (ఏఈఆర్ఓ) పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి అధికారులనుద్దేశించి ప్రసంగిస్తూ అసెంబ్లీ నియోజకవర్గాల వివరాలు, ఎస్ఐఆర్ కోసం నియమించిన సిబ్బంది (ఈఆర్ఓలు,ఏఈఆర్ఓలు బిఎల్ఓలు,సూపర్ వైజర్లు), ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాలగురించి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 68.30 మ్యాపింగ్

>>7



# నేడో, రేపో 'నైరుతి'

కేరళంలోకి ప్రవేశించనున్న రుతుపవనాలు

మరో ఐదు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి

పలు ప్రాంతాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

**న్యూఢిల్లీ, జూన్ 2:** నైరుతి రుతుపవనాలు జూన్ 3వ తేదీ సాయంత్రం లేదా 4న కేరళం రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని భారత వాతావరణ శాఖ (ఐఎండి) అంచనా వేసింది. అరేబియా సముద్రం మీదుగా తేమతో కూడిన గాలులు బలపడుతుండంతో రుతుపవనాల కదలిక వేగవంతమవుతోంది. దీని ప్రభావంతో రుతుపవనాల రాకతో దక్షిణ భారత రాష్ట్రాల్లో వచ్చే ఆరు నుంచి ఏడు రోజుల పాటు విస్తృతంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రుతుపవనాల పురోగతి, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ నుండి విదర్భ, తెలంగాణ, రాయలసీమ

>>7

# 3 నోటిఫికేషన్లు

290 ఉద్యోగాలకు నియామకాలు

పిసిబిలో 19 పోస్టులు, ఆర్‌అండ్‌బిలో 271 పోస్టులు భర్తీ




**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 2:** తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు గుడ్‌న్యూస్. 290 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) రాష్ట్రవతరణ దినోత్స వం సందర్భంగా మంగళవారం నోటిఫికేషన్లను జారీ చేసింది. పొల్యుషన్ కంట్రోల్ బోర్డు, ఆర్ అండ్ బీ శాఖల్లో పోస్టుల భర్తీ కోసం మూడు నోటిఫికేషన్లను జారీ చేసింది. పొల్యూష్ కంట్రోల్ బోర్డులో 19 అసిస్టెంట్ ఎన్విరాన్ మెంటల్ ఇంజనీర్ పోస్టుల కోసం నోటిఫికేషన్ నంబర్ 02/ఓజీ/పీసీ/2026ను జారీ చేసింది. 19 పోస్టులకు 18 నుంచి 44 సంవత్సరాల వయోపరిమితితో అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. దరఖాస్తులను జూన్ 10 నుంచి ప్రారంభించి జులై 17 వరకు స్వీకరించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ఎం హరిత ప్రకటనలో తెలిపారు. రోడ్లు భవనాల శాఖలో 222 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ నంబర్ 01/జీ/ఆర్‌బీ/2026ను కమిషన్ జారీ చేసింది. 18 నుంచి 44 సంవత్సరాల వయోపరిమితిని విధించింది. దరఖాస్తులను జూన్ 6 నుంచి జులై 13 వరకు స్వీకరించనున్నట్లు ప్రకటించారు. అలాగే రోడ్లు భవనాల శాఖలోనే 49 అసిస్టెంట్

>>7

వార్త


దిగజారడం ప్రారంభించనే కూడదు. ఒక్కసారి దిగజారితే ఇక దానికంతే ఉండదు.

- హెచ్. లాంగ్‌ఫెలో

# పటిష్టమైన విత్తన చట్టమే పరిష్కారం


బాధపడడం తప్ప బాధించడం తెలియని అన్నదాతల్లో ఇటీవల కాలంలో సహనం, ఓర్పు సన్నగిల్లి ఆందోళనబాటలు పడుతున్నారు. తనకు ఎంతటి నష్టం జరిగినా, ఎవరు ఎంతగా మోసగించినా తమలో తాము కుళ్లి కుళ్లి మనసులోనే బాధపడి చివరకు ప్రాణ త్యాగం చేయడానికి అయినా సిద్ధపడే వారేతప్ప తమను దగా చేసినవారిపై కక్ష కట్టి దాడులు చేసేందుకు సాహసించలేకపోయేవారు. పంటలకు గిట్టుబాటు ధర రాకపోయినా దళారుల హస్తలాఘవంతో కోలుకోలేని దగాకు గురవుతున్నా తమ కర్మకు తామే బాధపడుతూ మనో వేదనతో ఇంటిముఖం పట్టేవారు. కానీ ఇటీవల కాలంలో రోడ్లపైకి రావడం, ధర్నాలు, రాస్తారోకోలు లాంటి నిరసన కార్యక్రమాలు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఆరుగాలం అష్టకష్టాలు పడి ఇటు తోటి మానవుడి దోపిడీని, అటు ప్రకృతి సహాయ నిరాకరణను ఎదుర్కొని పండించిన పంటలను అమ్ముకోవడంలో ముఖ్యంగా ఇటీవల కాలంలో వారు పడిన, పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. దేశవ్యాప్తంగా కూడా అధిక శాతం మార్కెట్ యార్డుల్లో దళారులదే రాజ్యం.కొలతల్లో మోసం, ధరలు నిర్ణయించడంలో దగా, ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ చేతివాటం ప్రదర్శించేందుకు దళారులు నిత్యం పొంచి ఉంటూనే ఉన్నారు. అన్నదాతలు మోసపోతూనే ఉన్నారు. మోసపోయేవారు ఉన్నంత కాలం మోసం చేసేవారు ఉంటారన్నటే ఈ దళారీవ్యవస్థ ఉన్నంత కాలం రైతులకు ఈ బాధలు తప్పవు. అందుకే విత్తే దగ్గర నుంచి విక్రయించేవరకు అన్నిస్థాయిల్లో దగా జరుగుతున్నది. దీనిని నిరోధించేందుకు పాలకులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నట్లు చెప్తున్నా అవి మాటలకే పరిమితమవుతున్నాయి. ఇప్పుడు ఖరీఫ్ సీజన్ ఆరంభం కాబోతున్నది. రోహిణికార్తె దాటి మరోవారంలో మృగశిరలో అడుగుపెట్టబోతున్నాం. పంటలకు విత్తనాలు మూలం. యేటా ఎందరో రైతులు నకిలీ, నాసిరకం విత్తనాలతో మోసపోయి ప్రాణాలు తీసుకుంటున్నారు.మరొక పక్క నకిలీ, నాసిరకం విత్తనాలు సరఫరా చేసేవారిపై పటిష్టమైన చర్యలు తీసుకుంటామని, వదిలిపెట్టే ప్రసక్తే లేదని పిడి చట్టాన్ని ప్రయోగించి కటకటలా వెనక్కి పంపేందుకు వెనుకాడమని పాలకులు హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఆ నకిలీ విత్తనాల వ్యాపారులు అవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే నకిలీ విత్తనాల వ్యాపారం జోరందుకున్నది.అక్కడక్కడ పట్టుబడుతున్నాయి కూడా. రైతుల అవసరాలను, డిమాండ్‌ను ఆసరాగా తీసుకొని ఈ నకిలీ విత్తనాల వ్యాపారులు ఒక వ్యూహం ప్రకారం రైతులను దగా చేస్తున్నారు. ఇప్పుడే కాదు ప్రతియేడాది సీజన్‌లో అధికారులు చేస్తున్న దాడుల్లో వేలాది కోట్లాది రూపాయల విలువైన నకిలీ, నాసిరకమైన విత్తనాలు పట్టుబడుతున్నాయి. నిందితులను అదుపులోకి తీసుకుంటున్నారు. కేసులు పెడుతున్నారు.అలా జరిమానా చెల్లించి మరుసటి రోజు నుంచే జైలు నుంచి రాగానే వారు అదే వ్యాపారం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్‌ను కూడా ఏర్పాటు చేసింది. ఆకస్మిక దాడులను చేయిస్తున్నారు.అయినా ఇదేమీ ఆగడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో అధిక శాతం వరి, పత్తి పంటలుసాగు చేస్తున్నారు. అయితే ఈసారి తెలంగాణలో పత్తి విత్తనాలు కోటి ప్యాకెట్లు అవసరం ఉంటే మూడు కోట్లు తెప్పించామని,విత్తన కొరత లేదని అధికారవర్గాలు చెబుతున్నాయి. అలాగే వరి విషయంలో కూడా కొరత ఉండకపోవచ్చునని అంచనాలు వేస్తున్నారు. కానీ కొన్ని రకాల పత్తి విత్తనాలు,మరికొన్ని వరి విత్తనాలకే డిమాండ్‌ఉంది. రైతులు అవే కావాలని కోరడంతో దీన్ని ఆసరాగా తీసుకొని నకిలీలు విజృంభిస్తున్నారు. ఇక పప్పు దినుసులు, కూరగాయలు, తదితర పంటల సాగు గణనీయంగా తగ్గిపోతున్నది. ఆ విత్తనాలు కూడా సకాలంలో నాణ్యమైన విత్తనాలు దొరకడం లేదు. కూరగాయలకు సంబంధించిన నకిలీ విత్తనాలకు అదుపే లేకుండాపోతున్నది. బిల్లులు లాంటివి ఎలాంటి ఆధారాలు లేకుండా కోట్లాది రూపాయల విలువైన విత్తన వ్యాపారం జరుగుతున్నది. ఇతర రాష్ట్రాల నుంచి తెలుగు రాష్ట్రాలకు తెప్పించుకొని బహిరంగంగానే అమ్ముకుంటున్నారు.వీటికి రైతులు అడిగానా రసీదులు ఇవ్వకుండా ఆధారాలు లేకుండా జాగ్రత్తలు పడుతున్నారు. ఈవ్యాపారం ఇక్కడా అక్కడా అని కాదు. తెలుగు రాష్ట్రాల్లో బాహాటంగా జరుగుతున్నా, అధికారులకు స్పష్టంగా తెలిసినా మౌనంగా ఉండిపోతున్నారు. ప్రభుత్వపరంగా ఎన్ని చర్యలు తీసుకున్నా విత్తనాల కొరత దృష్ట్యా ఈ నకిలీ వ్యాపారులపై ఆధారపడక తప్పడం లేదు. అసలు ఈ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు గత రెండు,మూడు దశాబ్దాలుగా పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం సఫలీకృతం కావడం లేదు. పోలీసులన్నా, చట్టాలన్నా వ్యవసాయ శాఖ అధికారులన్నా పాలకులు చేస్తున్న హెచ్చరికలన్నా ఈవ్యాపారుల్లో భయభక్తులు లేకుండాపోయాయి. ఇందుకు ఎన్నో కారణాలున్నాయి.ఇందులో ప్రధానమైనది లోపభూయిష్టమైనవిత్తన చట్టమే. ఆ చట్టం రైతుల కంటే దళారులకే ప్రయోజనకరంగా ఉంది. ఆ చట్టాన్ని మార్చాలని, దాని స్థానంలో పటిష్టమైన కొత్తచట్టాన్ని తేవాలని ఏనాటి నుంచో ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు.విదేశాల్లో నకిలీ నాసిరకం విత్తనాలతో మోసం చేసిన దళారులపై తీవ్రమైన చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి చర్యల కారణంగానే పొరుగునున్న చైనా లాంటి దేశాల్లో నకిలీ, నాసిరకం విత్తనాల ఉనికేలేదు. దేశంలో జరుగుతున్న రైతుల ఆత్మహత్యల్లో విత్తనాల్లో మోసపోయినవారి సంఖ్యతక్కువేమీ కాదు. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. వారికున్న ఒక్క ఉపాధిని వారిపాలిట మృత్యువుగా పరిణమించకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది.

మన ఆలోచనలు నాణ్యమైనవైతే మన మానసిక ఆరోగ్యం చక్కగా ఉంటుంది.



షేక్స్పియర్

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

# ప్రజావాక్కు



### సనాతనం అంటే ఏమిటి?

ఈమధ్య సనాతనం అనే పదం ఎక్కువగా ఉపయోగించబడుతుంది. పాపం సనాతనాన్ని రూపుమాపాలి అన్న స్టాలిన్ కొడుకు మీద కొంతమంది ఇరుచుక పడ్డారు. అయితే సనాతనం అంటే ఇది అని మాత్రం ఖచ్చితంగా చెప్పటం లేదు? ఏమిటి కారణం? తెలియకనా,కాదు. ఎందుకంటే సాక్షాత్తు ప్రధాని అంతటి వాడికి సనాతనం అంటే తెలియక మాట్లాడుతున్నాడు అని అనుకోలేం. అయితే పవన్ కళ్యాణ్ లాంటివారికి కూడా తెలియదు అని అనుకోలేము. ఎందుకంటే ఆయన ఉప ముఖ్యమంత్రి.మరిసనాతనం అంటేఏమిటి? ఇది అని ఎందుకు చెప్పటంలేదు? అభ్యుదయవాదులు ఇంతటి అశాస్త్రీయ మనసనాతనాన్ని పాతరిపెట్టాలని కోరుకుంటారు. ఎందుకంటే అవన్నీ పాతకాలపు ఆచారాలు. వాటిని కాదని, ఈ కాలానికి అవి సరిపడవు అని ఎంతో ముందుకు పోతున్నాము.మరిసనాతనంకావాలనుకునేవారు ఆలోచించాలి.

- నార్నెవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### శ్రమిస్తేనే ఫలితం దక్కుతుంది

పబ్లిక్ పరీక్షల్లో ఫలితాలు వెల్లడించిన తర్వాత కొంత మంది విద్యార్థులు వారి సహచర మిత్రులు కాస్త ఎక్కువ మార్కులు వచ్చిన తరుణంలో లేదా ఆశించిన ఫలితం రానప్పుడు కుంగుబాటు మరీ విపరీతమై అందరికీ బాధాకరమైన పనికి ఆలోచనారహితంగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరీక్ష తర్వాత సంతృప్తి లేనప్పుడు వెంటనేరెండోమారు ప్రయత్నానికి పూర్తి ధ్యానంతో దృష్టి సారించాలి. జీవితంలో ఇదేమీ ఆఖరి ఛాన్సు కాదు. తోటి వారితో పోల్చుకోవడం సందర్భం కానేకాదు. చదువుమీద విశ్వాసం దానికి తగిన శ్రమ వారికి వారే పెంచుకోవాలి. బలహీనతధోరణిఎక్కడైనా కష్టాలుతెస్తుందని గుర్తెరగాలి.

- బి. మేఘునాదం, విశాఖపట్నం

### గౌరవ వేతనాలను తగ్గించాలి

రాష్ట్రంలో పశువుల సంఖ్య తగ్గింది. పశుగాణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న గోపాల మిత్రల సేవలను రద్దు చేయాలి. వీరికి ఇచ్చే గౌరవ వేతనం వలన ప్రభుత్వానికి ఆర్థిక భారం పడుతుంది. వీరు గ్రామాలలో అవినీతిఅక్రమాలకు పాల్పడుతున్నారని కొన్ని చోట్ల వివాదాలు ఉన్నాయి. వీరిసేవలు నిలిపి వేస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలి. గ్రామాలలో వీళ్ళు స్వచ్ఛంద సేవల పేరిట చందాలు వసూలు చేస్తున్నారు.

- రాపాక రవీందర్, జనగాం

### తెలుగుకు ప్రాముఖ్యతనివ్వాలి

ఈ విద్యాసంవత్సరంలో మన రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలను 6,17,827మంది రాయగా 5,26,677మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అందులో ప్రభుత్వ పాఠశాలలలో చదివిన బాల, బాలికలు అత్యధిక మార్కులు, ర్యాంకులు సాధించటంతో తల్లిదండ్రులందరూ సంతోష పడ్డారు. కానీ పదో తరగతి పరీక్షలలో తప్పిన వారిలో అత్యధిక మంది తెలుగు సబ్జెక్టులో తప్పటం తెలుగు భాషా వేత్తలు, భాషాభిమానుల హృదయాలను తీవ్ర నిరాశ పరుస్తోంది. రాష్ట్రంలో ఐదుకోట్ల మందికి మాతృభాషైన తెలుగు సబ్జెక్టులో ప్రభుత్వ పాఠశాలలోచదివిన విద్యార్థులు సైతం ఫెయిలవ్వటం శోచనీయం.తెలుగు సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుల లోపమా, విద్యార్థుల నిరాసక్తతా అనిసమీక్షించి సరిదిద్దుకోవాలి.మాతృభాషలోనే పట్టులేకుంటే ఇతర భాషలను ఎలా నేర్చుకుంటారు. కొంత మంది ఉపాధ్యాయులు కూడా తెలుగు నేర్పే ఏదో బోధిస్తున్నాములే అనుకుంటారు. కానీ అలా వ్యవహరించకుండా తెలుగు భాషను సరిగ్గా నేర్పాలి.

- సి.రామకృష్ణ, నల్గొండ జిల్లా

### తొలకరి జల్లుకు వేళయె...

వర్షాకాల సమయం ఆరంభం అవుతున్న శుభ తరుణంలో విత్తన నాటుకు సంసిద్ధంగా ఉన్న నా రైతన్నలు...ప్రతి ఏటా పెరుగుతున్న ఎరువుల ధరలు,వినియోగ వస్తువుల ధరలతో అప్పుల పాలుఅయిన పర్వాలేదు...అని మొక్కవోని ధైర్యంతో ప్రతి ఏడు నా సమాజానికి బుక్కెడు బువ్వ పెట్టాలని నిరంతరం శ్రమిస్తున్న నా రైతన్న సకాలంలో వర్షాలు పడి పాడిపంటలు పరిడవిల్లాలనీ ఆ ప్రకృతి కరుణిస్తేనే విజయం లేదంటే అపజయమే.

- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలం!

పశ్చిమాసియా ఘర్షణ కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఈ ఘర్షణలు నేడు ప్రతి దేశపు వంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హార్ముజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది.నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో ఒక్కసారిగా ఎగబాకాయి. అందరూ ఖర్చులు తగ్గించుకొని పొదుపు పాటిస్తే బాగుంటుంది.

-ఎన్. నాగరాజు, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# బంగ్లాకు తరలిపోతున్న వలస ఓట్లు!

**చొరబాటుదార్లను గుర్తించడానికి ఎన్నికల కమిషన్ ఓటర్ల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం 'సర్' ను నిర్వహించింది. మైనార్టీలను ఏరివేసే మతతత్వ దురుద్దేశంతోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్ నిర్వహిస్తోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో రాద్ధాంతం చేసారు. చొరబాటుదార్ల ఓట్ల బ్యాంక్‌ను కాపాడుకోడానికి త్రుణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ నల్లకోటు వేసుకుని సుప్రీం కోర్టు వరకూ వెళ్లారు. సెక్యులరిజం కాపాడుతామని చెప్పే మేధావులు సర్ కార్యక్రమానికి మతతత్వం అంటగట్టేసారు. పిటిషన్లతో విసిగిపోయిన సుప్రీం కోర్టు కూడా చివాట్లు పెట్టి 'వచ్చి పోయేవారికి భారత్ ధర్మసత్రం కాదని' తేల్చేసింది. అయినా మనవాళ్లు మతతత్వ వాదన మానుకోలేదు. లక్షలాది మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడం చూసి వీరంతా ఏమంటారో చూడాలి.**



సరికొండ రవీంద్రనాథ్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమత బెనర్జీ ఓట్లన్నీ బంగ్లాదేశ్‌కు తరలిపోతున్నాయి. భారతదేశంలోకి వచ్చిన బంగ్లాదేశ్ చొరబాటు దార్లను ప్రభుత్వం వెనక్కు పంపించే పని మొదలు పెట్టడంతో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.కాగా సరిహద్దులో ఉద్రిక్తతలను నివారించడానికి జూన్ 8వ తేదీన న్యూఢిల్లీలో డైరక్టర్ జనరల్ స్థాయి చర్చలు జరపాలని భారత్, బంగ్లా నిర్ణయించాయి. పశ్చిమ బెంగాల్‌లో సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత చొరబాట్లను నివారించడానికి కంచె నిర్మాణం ప్రారంభించారు. దీనితోబాటు మూడంచెలుగా 'అక్రమ వలసదార్లను గుర్తించడం, ఫేక్ గుర్తింపు కార్డుల రద్దు, దేశ బహిష్కరణ' కార్యక్రమాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. ఫలితంగా వేలాది మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌లోని సొంత గ్రామాలకు వెళ్లడానికి సరిహద్దులోని హాకీంపూర్ దగ్గరికి చేరుకుంటున్నారు. విశేషమేమంటే వీరంతా స్వచ్ఛందంగానే స్వదేశానికి వెళ్లిపోతున్నారు. సరిహద్దులో కంచె వేయడానికి పశ్చిమ బెంగాల్ అధికారులు ప్రయత్నించగా చొరబాటు దార్ల నుంచి, బిజిబి సిబ్బంది నుంచి హింసాత్మక ప్రతిఘటనలు ఎదురయ్యాయి. దీనితో కంచె వేయాల్సిన సుమారు 142 ఎకరాల భూభాగాన్ని (600 కిలోమీటర్ల దూరం) సరిహద్దు భద్రతా దళానికి (బిఎస్ ఎఫ్) పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అప్పగించారు. సరిహద్దులోని కూచ్ బీహార్, జుల్పాయ్ గురి, డార్జిలింగ్, ఉత్తర్ దినాజ్ పూర్, దక్షిణ్ దినాజ్ పూర్, మాల్దా, ముర్షీదాబాద్, నదియా, ఉత్తర 24పరగణాల జిల్లాల్లో ఫెన్సింగ్ వేయాల్సిన ఈ భూభాగం విస్తరించి ఉంది. భారత్ బంగ్లా మధ్య 4వేల 96 కిలోమీటర్ల సరిహద్దుఉంది. ఇప్పటివరకూ 3 వేల 232 కిలోమీటర్ల కంచె నిర్మించారు. 174 కిలోమీటర్ల దూరం కంచె నిర్మించడానికి అవకాశం లేదు. సుమారు 600 కిలోమీటర్ల మేర మాత్రం కంచె నిర్మిస్తున్నారు. మమత బెనర్జీ అధికారంలో ఉన్నంతకాలం కంచె నిర్మించడానికి అనుమతి ఇవ్వలేదు. బిజెపి నేత సువేందు అధికారి ముఖ్యమంత్రి కావడంతో కంచె నిర్మాణంతోబాటు చొరబాటు దార్లను పంపించే ప్రక్రియ మొదలైంది. ఇప్పటి వరకూ సుమారు 30 లక్షల మంది చొరబాటుదార్లు బంగ్లాదేశ్‌కు వెళ్లిపోయారని అంచనా. మరో ఇరవై లక్షల మంది తమ దేశం వెళ్లిపోడానికి మూటాముల్లె సర్దుకుని సరిహద్దు దగ్గరికి చేరుకుంటున్నారు. చొరబాటుదార్లను గుర్తించడానికి మాల్దా, ముర్షిదాబాద్ జిల్లాల్లో చొరబాటుదార్ల శిబిరాలను ఏర్పాటు చేసారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే చొరబాటు దారులను పంపించి వేయడానికి భారత్ ప్రయత్నిస్తోంది. పాస్‌పోర్ట్, వీసా,ఆధార్‌కార్డ్, ఓటర్ కార్డ్ ఇతర డాక్యుమెంట్లు, వారి స్టేట్‌మెంట్లు, చుట్టుపక్కల వారి నుంచి, ఇంటెలిజెన్స్ నుంచి సేకరించిన సమాచారం ఆధారంతో చొరబాటుదార్లను గుర్తిస్తున్నారు. ఇలా ఉండగా చొరబాటుదార్లను బలవంతంగా పంపించి వేయకూడదని, అంతర్జాతీయ చట్టాలను అమలు చేయాలని బంగ్లాదేశ్ కోరుతోంది. దౌత్య మార్గాల ద్వారానే చొరబాటు దార్లను తిరిగి పంపాలని అంటోంది. చొరబాటుదార్లను బలవంతంగా పంపిస్తే తాము 'తగిన చర్యలు తీసుకుంటామని' బంగ్లాదేశ్ విదేశాంగమంత్రి ఖలీలుర్ రహమాన్ భారత్‌ను హెచ్చరించారు. కానీ ఇటువంటి సమస్యలు దౌత్యం ద్వారా పరిష్కారం కావని గతంలో రుజువయింది. భారత్ దేశం సుమారు ఐదేళ్ల క్రింతం 2,860 మంది చొరబాటు దార్ల పేర్లను బంగ్లాకు పంపించింది. కానీ వీరి జాతీయతను



ఇప్పటికీ బంగ్లా ప్రభుత్వం విచారించి తేల్చలేదు. లక్షలాది మంది గుర్తింపు ఎప్పటికి తెలుతుంది? దీనికి బంగ్లా నుంచి సమాధానం లేదు. అందుకే భారత్ తన దారిలో తను చొరబాటుదార్లను పంపించి వేస్తోంది. చీమ పుట్టల్లా బైట పడుతున్న చొరబాటు దార్లను చూసి ఇంతకాలం వీళ్ల ఎక్కడ ఉన్నారా అని ప్రపంచ దేశాలు విస్తుపోతున్నాయి. అస్సాంలో 20 లక్షల మంది చొరబాటుదార్లు ఉన్నట్టు అంచనా. కేరళ, తెలంగాణా నుంచి కూడా చొరబాటుదారులను ఎన్ఐఎ వెనక్కు పంపివేస్తోంది. చొరబాటుదార్లు స్వచ్ఛందంగా వెనక్కు వెళ్లడానికి భారత ప్రభుత్వ పట్టుదల ప్రధాన కారణం. కాగా మరో మూడు కారణాలున్నాయి. ఒకటి ఓట్లు లేకపోవడంతో నిన్నటి వరకూ చొరబాటుదార్ల చుట్టూ తిరిగిన రాజకీయ నాయకులు మొహం చాటేస్తున్నారు. రెండు రేషన్ కార్డుతో సహా అన్నిగుర్తింపు కార్డులు రద్దయిపోయాయి. మూడు తమను సమర్థించే మమతా బెనర్జీ ప్రభుత్వం అధికారంలో లేదు. ప్రభుత్వం తొలుత అరెస్టు చేసి నిర్బంధంలో ఉంచుతుంది.తర్వాత మూడేళ్ల వరకూ జైలు తప్పదు. దీనికి తోడు అక్రమంగా నిర్మించిన కట్టడాలన్నింటిని భద్రతా సిబంది కూల్చివేస్తున్నారు. ఇక భారతదేశంలో ఉండి ప్రయోజనం లేదని చొరబాటుదార్లే అభిప్రాయపడుతున్నారు. 'సర్' నివేదికను బట్టి పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో సుమారు ఎనభై లక్షలమంది చొరబాటు దార్లు ఉంటారని అంచనా. రాష్ట్ర జనాభా కోటి మంది. అంటే స్థానికుల సంఖ్యతో సమానంగా చొరబాటుదార్లు ఉన్నారన్న మాట. దీన్ని బట్టి స్థానికుల ఎన్ని కష్టాలు అనుభవిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. తమను త్వరగా తమ దేశానికి పంపించి వేయమని చొరబాటుదార్లు వేడుకుంటున్నారు. వీరంతా దళారులకు 5 వేల నుంచి పాతిక వేల వరకూ ఇచ్చి భారతదేశంలోకి చొరబడ్డారు. గుర్తింపు కార్డుల ప్యాకేజిని బట్టి దళారులు వీళ్ల దగ్గర డబ్బులు దండుకున్నారు. వీళ్లలో ఎక్కువ మంది మైనార్టీలు కావడం, ఓటు బ్యాంక్ పెరుగుతూండటంతో మమతా బెనర్జీ ప్రభుత్వం బహుముఖంగా చొరబాట్లను ప్రోత్సహించింది. వీరిలో ఎక్కువ శాతం గత ఐదేళ్లలో భారత దేశానికి వచ్చినవారే. వీరు చిన్న కూలీపని నుంచి లక్షల రూపాయల వ్యాపారాలు చేస్తున్నవారు ఉన్నారు. సరిహద్దులో చొరబాటుదార్లుప్రత్యేక కాలనీలు కూడా కట్టుకున్నారు. పదేళ్ల క్రితం భారతదేశంలో ప్రవేశించిన చొరబాటు దార్ల దగ్గర కూడా బంగ్లాదేశ్ నేషనల్ ఐడెంటిటీ కార్డులు (గుర్తింపు కార్డులు) ఉండటం గమనార్హం. వీటిని చూపించి చొరబాటుదార్లు తిరిగి బంగ్లాదేశ్‌లోకి వెళ్లిపోతున్నారు.సరిహద్దులో ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో ఉండటంతో రెండు దేశాల మధ్య డైరక్టర్ జనరల్ స్థాయి ద్వైపాక్షిక సమావేశం జూన్ 8 న్యూఢిల్లీలో జరపాలని భారత్, బంగ్లాదేశ్ నిర్ణయించాయి. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బిఎన్‌పి) అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటువంటి సమావేశం ఏర్పాటు కావడం ఇదే మొదటిసారి.సరిహద్దులో సహకారం, నేరాల నియంత్రణ కోసంరెండు దేశాల మధ్య డిజి స్థాయి సమావేశాలు 1975లో ప్రారంభమయ్యాయి. 1993 నాటి నుంచి రెండు సంవత్సరాలకు ఒకసారి సమావేశాలు జరిగేవి. ఒకసారి ఢాకాలో, మరోసారి న్యూఢిల్లీలో నిర్వహించేవారు. జూన్ 8న జరగనున్న సమావేశంలో బంగ్లా తరపున డైరెక్టర్ జనరల్ మేజర్ జనరల్ మహ్మద్ అష్రపుజ్జమాన్ సిద్దిఖీ, భారత్ తరపున బిఎస్ ఎఫ్ డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ ఈ సమావేశంలో పాల్గొంటారు. చొరబాటు దార్లను గుర్తించడానికి ఎన్నికల కమిషన్ ఓటర్ల ప్రత్యేక గుర్తింపు కార్యక్రమం 'సర్' ను నిర్వహించింది. మైనార్టీలను ఏరివేసే మతతత్వ దురుద్దేశంతోనే నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్ నిర్వహిస్తోందని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో రాద్ధాంతం చేసారు. చొరబాటుదార్ల ఓట్ల బ్యాంక్‌ను కాపాడుకోడానికి త్రుణమూల్ కాంగ్రెస్ అధినేత మమతా బెనర్జీ నల్లకోటు వేసుకుని సుప్రీం కోర్టు వరకూ వెళ్లారు. సెక్యులరిజం కాపాడుతామని చెప్పే మేధావులు సర్ కార్యక్రమానికి మతతత్వం అంటగట్టేసారు. పిటిషన్లతో విసిగిపోయిన సుప్రీం కోర్టు కూడా చివాట్లు పెట్టి 'వచ్చి పోయేవారికి భారత్ ధర్మసత్రం కాదని' తేల్చేసింది. అయినా మనవాళ్లు మతతత్వ వాదన మానుకోలేదు. లక్షలాది మంది చొరబాటు దార్లు బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడం చూసి వీరంతా ఏమంటారో చూడాలి. ●

# ఫలరాజుల దిగుబడికి 'కాపు' కాసేదెవరు?

వరిగొండ నవీన్ కుమార్

ఈ యేడాది భారతీయ మామిడి పండ్ల ఎగుమతి విషయానికొస్తే కాస్త వెనుకబడి ఉన్నాం. జాతీయ స్థాయిలో ఉత్పత్తి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో చూస్తే ఈ యేడాది తగినంత మామిడి కాపు జరుగలేదు. గత యేడాది ఎపెడా గణాంకాల ప్రకారం 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం సుమారు 29.93 మెట్రిక్ టన్నుల మామిడి పళ్లను ఎగుమతి చేయగా 56.5 మిలియన్ అమెరికన్ డాలర్ల రాబడి రాబట్టింది. మామిడి పండ్లు భారత్ నుంచి అరబ్ దేశాలు, అమెరికా యునైటెడ్ కింగ్ డమ్, కువైట్, ఖతార్ ప్రాంతాలకు ఎగుమతి చేసి సాలీనా 80 మిలియన్ డాలర్లకుపైగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నాం. మామిడి పల్ప్, జ్యూస్, ప్రాసెస్డ్ ఉత్పత్తుల ఎగుమతులు గణనీయంగా ఉన్నాయని చెప్పకుంటున్నా ఆల్ఫోన్సా వంటి విలువైన మామిడి పండ్ల ఎగుమతి బాగా తగ్గింది. ప్రధానంగా మహారాష్ట్రలో తీవ్రమైన వాతావరణ మార్పుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో 50 శాతం నుండి 90 శాతం వరకు దిగుబడి తగ్గింది. ఏదో మామిడి సాగు దిగుబడులతో విదేశీ మారక ద్రవ్యం ఆర్జిస్తున్నామని గొప్పగా చెప్పుకోడానికి ఉన్నా ఆ వెరైటీ మామిడి సాగును పెంచుకునేందుకు ప్రస్తుతమున్న ప్రయత్నాలు చాలవు. వాతావరణ ప్రభావంతో ఈసారి మామిడి సాగులో రైతు ఎంతో నష్టం అనుభవించాడు. తరచు ప్రకృతి బీభత్సంతో



అకాల వర్షాలతో పూత రాలిపోయింది. దిగుబడి తగ్గింది. ఈ సీజన్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్‌లలో మామిడి పుష్పదశలో ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు, అకాల వర్షాలు, వడగళ్ల వానల ప్రభావంతో పూత, పిందె రాలిపోయి మామిడి సాగు పెద్ద సవాలే ఎదుర్కొంది. ప్రపంచంలోనే భారత్ అతిపెద్ద మామిడి ఉత్పత్తికాగా మామిడి ఉత్పత్తుల్లో 19శాతం మాత్రమే ఈసారి ఎగుమతులకు నోచుకుంది. ఈసారి ఎగుమతుల్లో షిప్‌మెంట్లు 40 శాతం తగ్గిందని అంచనా. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ తన 'మన్ కీ బాత్' 134 ఎపిసోడ్ కార్యక్రమంలో మామిడి ప్రాధాన్యతను ప్రస్తావించారు. దేశంలో ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకపు మామిడి పండ్లకు అనుకూలంగా ఉండి సాటిలేనివిగా మార్పుచెందాయని వివరించారు.దక్షిణ భారతదేశంలో బంగెన పల్లి తోతాపురి, నీలం, మాల్గో రకాలుఊరిస్తాయి.అటు ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌లో సువర్ణ ముఖి రకాలు విరివిగా పండుతున్నాయని, ఉత్తరప్రదేశ్‌లో దశహరీ, బెంగాల్‌లో హిమసాగర్ విరివిగా పండుతున్నాయి. కాశీలోని లాంగ్రా రకం మామిడి పండిన తర్వాత కూడా ఆకుపచ్చగానే ఉంటాయి. కానీ ఎగుమతి చేసే విధంగా ప్రతిసీజన్‌కు ముందుగానే మామిడి తోటలవృద్ధికి, యజమాన్యానికి తోడ్పడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది.భవిష్యత్తులో వాతావరణ మార్పులకు తట్టుకునేసాగు పద్ధతులు, విలువ ఆధారిత ప్రాసెసింగ్, బలమైన ఎగుమతి విధానాలపై నిర్ణయాలు తీసుకోవడం అవసరం. ●

# నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లేదా?

పాపని నాగరాజు

దేశంలో ఉద్యోగ నియామకాల చుట్టూ పెరుగుతున్న అసంతృప్తి కేవలం నిరుద్యోగ సమస్యకు సంబంధించినది మాత్రమే కాదు. ఇది నియామక వ్యవస్థపై యువతలో పెరుగుతున్న నమ్మక సంక్షోభానికి ప్రతిబింబం. ఒకవైపు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, నిరుద్యోగం తగ్గుతోందని గణాంకాలు చెబుతుండగా, మరోవైపు నేలమీద యువత అనుభవం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. నియామకాల ఆలస్యాలు, పారదర్శకత లోపం, పేపర్ లీకులు, కోర్టు వివాదాలు, సమాచార అస్పష్టత, ఫలితాలపై అనుమానాలు వంటి అంశాలు యువతలో తీవ్రమైన అనిశ్చితిని పెంచుతున్నాయి. ఈ సంక్షోభం అందరినీ సమానంగా ప్రభావితం చేయడం లేదు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ, పట్టణ పేదలలోనూ మొదటి తరంలో విద్యావకాశాలు పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ దళితబహుజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కేవలం ఉపాధి అవకాశాలు మాత్రమే కావు, అవి సామాజిక భద్రత,గౌరవం, కుటుంబ ఆర్థిక స్థిరత్వం, తరతరాల వెనుకబాటుతనాన్ని అధిగమించే మార్గం కూడా. అందువల్ల నియామక వ్యవస్థలో ఏర్పడుతున్న అవకతవకలు, ఆలస్యాలు, అపారదర్శక విధానాలు వీరిపైనే ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. లక్షలాది రూపాయలు అప్పులు చేసి, హైదరాబాద్‌లో కొన్నిప్రాంతాల్లో చిన్న చిన్న గదుల్లో సంవత్సరాల తరబడి జీవిస్తూ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత పరిస్థితి ఈ సంక్షోభ తీవ్రతను స్పష్టంగా చూపిస్తోంది.కుటుంబాల ఆశలు, అప్పులు,భవిష్యత్తు అన్నింటినీ భుజాలపై మోస్తూ చదువుతున్న యువతకు చివరికి ఎదురవుతున్నవి వాయిదాలు, రద్దయిన పరీక్షలు, కోర్టు కేసులు, అనిశ్చితి. ఒక విద్యార్థి కష్టపడి చదివితే ఉద్యోగం సాధించగలడనే ప్రాథమిక సామాజిక నమ్మకాన్నే నియామక వ్యవస్థలోని అవ్యవస్థ దెబ్బతీస్తోంది. దేశంలో నిరుద్యోగ పరిస్థితిపై అధికారిక గణాంకాలు కొంత మెరుగుదల కనిపిస్తున్నాయని చెబుతున్నాయి. కానీ అదేగణాంకాలు యువతకు స్థిరమైన, నాణ్యమైన ఉద్యోగ అవకాశాలు తగ్గుతున్నాయని కూడా సూచిస్తున్నాయి. సంఖ్యలు ఆశాజనకంగా కనిపిస్తున్నప్పటికీ, నేలమీద యువత అనుభవం మాత్రం భిన్నంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన 69 వేల ఉపాధ్యాయ నియామకాలపై వచ్చిన నిరసనలు ఈ విభేదానికి స్పష్టమైన ఉదాహరణ. తెలంగాణలో టీఎస్‌పీఎస్‌సీ పరీక్షల రద్దులు, గురుకుల నియామకాలపై వచ్చిన వివాదాలు కూడా ఇదే ఆందోళనను మరింత పెంచాయి. దీంతో ఉద్యోగాల సంఖ్యకంటే వాటి నియామక ప్రక్రియపై నమ్మకమే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కాన్పూర్‌లో జరిగిన గందరగోళమో, తెలంగాణలో జరిగిన పేపర్ లీకేజీలో కావొచ్చు, రాజకీయ పార్టీలు అధికారంలోకి రాకముందు యువతకు భారీ హామీలు ఇస్తాయి. ఉద్యోగాలు, పారదర్శక నియామకాలు,యువత భవిష్యత్తు గురించి గొప్పగా మాట్లాడుతాయి.కానీ అధికారంలోకి వచ్చినతర్వాత మాత్రం నియామకాల విషయంలో అదే నిర్లక్ష్యం,అదే ఆలస్యం,అదేఅపార



దర్శకత కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో యువతను 'దేశ భవిష్యత్తు' అంటున్న రాజకీయ పార్టీలు, అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం నియామకాల విషయంలో చీఫ్‌గా, బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు పెరుగుతున్నాయి.కాన్పూర్ కావచ్చు, తెలంగాణ కావచ్చు పార్టీలు వేర్వేరు అయినా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న అవ్యవస్థ మాత్రం ఒకేలా కనిపిస్తోంది. నేటి నియామక వ్యవస్థలో ప్రధానసమస్య ఉద్యోగాల కొరత మాత్రమేకాదు, వాటి చుట్టూ ఉన్న సమాచార స్పష్టత లేకపోవడమూ ఒక పెద్ద సమస్య. తెలంగాణ గురుకుల నియామకాల సందర్భంలో ఒకే బోర్డు నిర్వహించిన ప్రక్రియలో పీజీటీ అభ్యర్థులకు మార్కులు, రెస్పాన్స్ షీట్లు చూసుకునే అవకాశం ఉండగా, టీజీటీ అభ్యర్థులకు అదే అవకాశం లేకపోవడంవివక్ష, అపారదర్శకత ఆరోపణలకు దారితీసింది. ఒకే విధానంలో నిర్వహించిన పరీక్షల్లో సమాచారం అందుబాటులో తేడాలుఉండటం పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. ఫలితాల ప్రకటన కేవలం ఎంపిక జాబితాతో ముగియకూడదు. ప్రతి అభ్యర్థికి తన మార్కులు, కటాఫ్‌లు, ఎంపిక ప్రమాణాలు స్పష్టంగా తెలిసే విధానం అవసరం. లేకపోతే నియామక వ్యవస్థపై అనుమానం పెరుగుతూనే ఉంటుంది. నియామక వ్యవస్థలో పారదర్శకత లోపం, ఆలస్యాలు, అనిశ్చితి వంటి సమస్యలు అందరినీ ప్రభావితం చేసినప్పటికీ, వాటి తీవ్ర ప్రభావం ప్రధానంగా దళితబహుజన యువతపైనే పడుతోంది.గ్రామీణ ప్రాంతాల్లోనూ,పట్టణ పేదలలోనూ మొదటి తరంలో విద్యావకాశాలు పొందుతున్న యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు జీవిత మార్పుకు కీలక ఆధారం.ఇప్పటికీ భూములు, వ్యాపారాలు, ప్రైవేట్ ఆర్థిక వనరులు అధికంగా కొన్ని అగ్రకుల వర్గాల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉన్న నేపథ్యంలో, ఎస్సీ, ఎస్టీ, బీసీ యువత ప్రధానంగా విద్య, ప్రభుత్వ ఉద్యోగాల ద్వారానే ఎదుగుదలను ఆశ్రయిస్తున్నారు. అందువల్ల నియామకాలలో జరిగే ఆలస్యాలు, అవకతవకలు, అపారదర్శకత వీరిపైనే ఎక్కువ నష్టం మోపుతున్నాయి. నోటిఫికేషన్ల ఆలస్యాల వల్ల వయోపరిమితి దాటిపోతున్న అభ్యర్థుల్లో పెద్దసంఖ్య దళితబహుజన యువతదే. కుటుంబ ఆర్థిక బలహీనతల మధ్య సంవత్సరాల తరబడి సిద్ధమవుతున్న వారికి ఈ ఆలస్యాలు తిరిగి కోలుకోలేని నష్టంగా మారుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగం రాక, ప్రైవేట్ రంగంలో స్థిరపడలేకపోవడంవల్ల అనేక మంది తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. యువత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాల వైపు రావడాన్ని కొంత సామాజిక ఆధిపత్య వర్గాలు అసహనంతో చూడటం కూడా కనిపిస్తోంది. నియామక వ్యవస్థలో ఏర్పడుతున్న అనుమానాలు, వివాదాలు ఈ అసమాన సామాజిక నిర్మాణంతో సంబంధం లేకుండా చూడలేం. మన దేశ సామాజిక వ్యవస్థలో అణగారిన వర్గాలకు విద్య, అధికార, రాజ్యపాలన హక్కులను నిరాకరించిన మనుధర్మ ఆధారిత సామాజిక నిర్మాణం చారిత్రకంగా పనిచేసింది. 'విద్య', 'అధికార', 'రాజ్యపాలన' కొన్ని వర్గాలకే పరిమితమవ్వాలని భావించిన ఆ సామాజిక దృక్పథం ఆధునిక రాజ్యాంగ విలువలకు విరుద్ధం. రాజ్యాంగం సమాన అవకాశాల దిశగా మార్గం చూపించినప్పటికీ, నియామక వ్యవస్థలో కనిపిస్తున్న అసమానతలు ఇంకా సామాజిక న్యాయం పూర్తిగా సాధ్యపడలేదనే ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. వ్యవస్థపై విశ్వాసం కోల్పోతే అది కేవలం ఉద్యోగ సమస్యగా మిగలదు. ప్రజాస్వామ్యంపై నమ్మక సంక్షోభంగా మారుతుంది. ●

# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన పాలకులు

### రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** స్వరాష్ట్రం కోసం, భావితరాల బాగుకోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి, సమిధులైన అమరవీరులందరికీ ఘన నివాళులు అర్పిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. కోట్ల మంది ప్రజల శతాబ్దాల కల, వందలాది మంది యువకుల బలిదానాలతో సాధించుకున్న తెలంగాణలో దురదృష్టవశాత్తు గడిచిన 12ఏళ్ళ కాలంలో పాలకులు తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశారని, బిఆరెస్, కెసిఆర్ పది సంవత్సరాల పాలనలో బంగారు తెలంగాణ పేరుతో ప్రజలను మభ్యపెట్టి, కేవలం తమ బంగారు కుటుంబాన్ని మాత్రమే సృష్టించుకుందన్నారు. తెలంగాణ ఉద్యమానికి పునాదులైన "నీళ్ళు, నిధులు, నియామకాలు" అనే ఆకాంక్షను తుంగలో తొక్కి, రాష్ట్ర సంపదను దోచు కున్నారు. అమరవీరుల ఆశయా లను, ప్రజల ఆకాంక్షలపై పూర్తిగా నిరక్ష్యం చేశారన్నారు. గత పాల కుల అహంకార అవినీతి పాలన నుంచి విముక్తిల భిస్తుందని, తెలంగాణ ప్రజల జీవితా లలో మార్పు వస్తుందని నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే గత రెండున్నరేళ్లలో ఆశించిన మార్పు ఎక్కడా కనిపించలేదన్నారు. అమరవీ రులు ఏ ఆశయాల కోసమైతే ప్రాణ త్యాగం చేశారో ఆ నిజమైన ప్రజాస్వామిక, సామాజిక సమృద్ధివంతమైన తెలంగాణ ఇంకా సాకారం కావాల్సి ఉంది. కేవలం ఒక కుటుంబం కోసమో, లేదా కొందరు రాజకీయాల ముసుగులో చేసే వ్యాపారవేత్తలకోసమో తెలంగాణ ఏర్పాటు కాలేదు. తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మ గౌరవం కాపాడేందుకు మనమంతా కలిసికట్టుగా పోరాడదామని పిలుపునిచ్చారు.

# బిజెపి ఎప్పుడూ ప్రజల పక్షమే: రాంచందర్‌రావు

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల పక్షాన నిలబడటంలో బిజెపి ఎప్పుడూ ముందుంటుందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ, అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు, భారతీయ జనతా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు, ఎంతో మంది బలిదానాల ఫలితంగా సాధించుకున్న ఈ ప్రత్యేక రాష్ట్రం, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడటమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, అవినీతి రహిత, సమగ్ర అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య తెలంగాణను నిర్మించుకుందామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# డిజిపి ఆఫీస్‌లో ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రావతరణ వేడుకలు డిజిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పి అండ్ ఎల్ విభాగం విభాగం ఐజి డాక్టర్ గజారావు భూపాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ ఎస్‌పి సతీష్, శాంతి భద్రతల ఎఐజి రమణ కుమార్. డిజిపి కార్యాలయ చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వ రరావు తోపాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పి అండ్ ఎల్ విభాగం ఐజి డాక్టర్ గజారావు భూపాల్

# ఎసిబి హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా అవతరణ వేడుకలు



ఎసిబి హెడ్ క్వార్టర్స్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న ఎసిబి డైరక్టర్ అవినాష్ మొహంతి

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** రాష్ట్రావతరణ వేడుకలు ఎసిబి హెడ్ క్వార్టర్స్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఈ సందర్భంగా ఎసిబి డైరక్టర్ అవినాష్ మొహంతి జాతీయ పతాకం ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎసిబి జాయింట్ డైరక్టర్లు సింధూశర్మ, ప్రవీణ్ కుమార్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.





మంగళవారం ప్రజావాణికి బారులు తీరిన దరఖాస్తుదారులు.

# సిఎం ప్రజావాణిలో 410 దరఖాస్తులు

**బేగంపేట, జూన్ 2,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన 227వ సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 410దరఖాస్తులు అందాయి. వాటిలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 222దరఖాస్తులు, పంచాయితీ రాజ్ ,గ్రామీణాభివృద్ది శాఖకు సంబంధించి 154దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 10దరఖాస్తులు అందాయి. ఇతర శాఖలకు సంబంధించి 24దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్, ఎన్ ఆర్ఐ సమన్వయ మండలి వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఉద్యమకారుల త్యాగాలు మరవలేం: దత్తాత్రేయ




తెలంగాణ ఉద్యమకారులను సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ, చిత్రంలో మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్ విద్యాసాగర్ రావు, ఎంపీ లు ఈటెల రాజేందర్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ సాధన కోసం నిరంతరం పోరాడి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్య మకారుల సేవలను స్మరించుకోవడం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత అని హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. మం గళవారం సాయంత్రం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్క రించుకుని, అలయ్ బలాయ్ ఫౌండేషన్ అధినేత్రి బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల సన్మాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన అనేది లక్షలాది మంది ప్రజల త్యాగాలు, విద్యార్థుల పోరాటాలు, ఉద్యోగ సంఘాల కృషి, కళాకారుల చైతన్యం, మేధావుల మార్గదర్శకత్వం మరియు ఉద్యమకారుల అంకితభావం ఫలితమని కొనియాడారు. ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొన్న వివిధ రంగాల ప్రతినిధులను సన్మానించడం ద్వారా వారి సేవలను గుర్తించి, భావితరాలకు స్ఫూర్తిగా నిలవడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వంటి మహనీయుల ఆలోచనలు తెలంగాణ ఉద్య మానికి స్ఫూర్తిగా నిలిచాయని గుర్తు చేశారు. మాజీ గవర్నర్ సి.హెచ్. విద్యాసాగర్ రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదం డరామ్, సీనియర్ నాయకులు సి.హెచ్. విఠల్, ప్రొఫెసర్ పురపాటి వెంకటనారాయణ, బూర నర్సయ్య గౌడ్, ప్రముఖ జర్నలిస్ట్ పాశం యాదగిరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులను, మేధావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, ఉద్యమకారులు

# కాంగ్రెస్, బిఆర్ఎస్ ప్రజాద్రోహ పాలన

### బూర నర్సయ్య గౌడ్, దత్తాత్రేయ, ఏలేటి ఆగ్రహం

### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు



**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం (డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ భవన్)లో వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపా ధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేడుకల్లో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్క కొమరయ్య, అంజిరెడ్డి, జాతీయ నాయకులు పొంగులేటి సుధాకర్ రెడ్డి, బిజెపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. గౌతం రావు, అశోక్, మాజీమంత్రులు పెద్దిరెడ్డి, రాములు, మాజీ ఎమ్మెల్యే చింతలరామచంద్రారెడ్డి, తదితర నాయకులు, భారీ సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజెపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ యావత్ తెలంగాణ ప్రజలకు, ఉద్యమ కారులకు, అమ రవీరుల కుటుం బాలకు బిజెపీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశానికి 1947లో స్వాతంత్రం వచ్చినా, తెలంగాణకు నిజమైన స్వేచ్ఛ 2014 జూన్ 2వ తేదీనే లభించిందని స్పష్టం చేశారు. నేడు దేశంలో తలసరి ఆదాయంలో తెలంగాణ రెండో స్థానంలో ఉండటానికి, ఇక్కడ అత్యధికంగా ధాన్యం పండటానికి ప్రధాని నరేంద్ర మోడీ చలవే కారణమని గుర్తుచేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్ ఒక వీక్లీ వేజ్ గవర్నమెంట్‌లా మారిందని, ప్రతి వారం ఢిల్లీకి మూటలు పంపితే తప్ప ముఖ్యమంత్రి పదవి నిలబడే పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు.

హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ బిజెపి మాట్లాడుతూ 2005లో బిజెపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న రాజ్‌నాథ్ సింగ్ నేతృ త్వంలో తెలంగాణకు అనుకూలంగా జాతీయ కార్యవర్గంలో తీర్మానం చేసిన మొట్టమొదటి రాజకీయ పార్టీ బిజెపీయేనని గుర్తుచేశారు. ఆ తీర్మానంతోనే కాంగ్రెస్‌లో చలనం వచ్చి ఉద్యమం ఉవ్వెత్తున లేచిందన్నారు. నీళ్లు, నియామకాల ప్రాతిపదికన తెలంగాణ వస్తే, గత బిఆర్ఎస్ ప్రభుత్వం గానీ, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం గానీ నీటి విషయంలో తెలంగాణకు తీవ్ర అన్యాయం చేశాయన్నారు. గోదావరి నది నుండి 2000 టిఎంసిల నీరు వృధాగా సముద్రంలో కలుస్తున్నా ప్రాజెక్టుల రిపేర్లు చేయకుండా రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపీ జెండా ఎగరడానికి అనుకూల వాతావరణం నిర్మించాలని పిలుపునిచ్చారు.

బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్రం వస్తే నిజాం, రజాకారుల క్రూర పాలన వల్ల తెలంగాణకు 1948సెప్టెంబర్ 17న విమోచనం కలిగిందన్నారు. గత 10ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో కేవలం దోపిడీ మాత్రమే జరిగిందని, మార్పు వస్తుందని కాంగ్రెస్‌ను నమ్మితే తెలంగాణ ప్రజలు మళ్లీ కబంద హస్తాల్లో చిక్కుకున్నారని విమర్శించారు. రాబోయే 2028 లేదా 2029లో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలం గాణ గడ్డపై కాషాయ జెండా ఎగరడం ఖాయమని, ఆ తర్వాతే యువతకు ఉద్యోగాలు, రైతులకు నీరు అందుతాయని స్పష్టంచేశారు. రాబోయే ప్రజాస్వామ్య యుద్ధంలో కార్యకర్తలంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని మహేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో పాల్గొని తెలంగాణ అమరవీ రులకు ఘన నివాళులు అర్పించారు.

# తెలంగాణ ప్రజలతో కమ్యూనిస్ట్ పార్టీ బంధం విడదీయరానిది

### సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ అవతరణ వేడుకలు: ఎమ్మెల్యే కూనంనేని

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 2:** తెలంగాణ ప్రజలతో కమ్యూనిస్ట్ పార్టీ బంధం విడదీయరానిదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణకు, సిపిఐ ఉన్నది పేగు బంధం లాంటిదన్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. కూనంనేని సాంబశివరావు అమరవీరులకు నివాళులర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్యపద్మ, కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎన్.జ్యోతి, ఎస్.ఛాయాదేవి, విజయలక్ష్మి పండిత్, ప్రజాపక్షం ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, సబ్బు రాజమోలి, జె.లక్ష్మి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, నాయకులు లక్ష్మి నారాయణ, ఉప్పలయ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఎస్‌టియు నాయకులు కర్నాకర్‌రెడ్డి తెలంగాణ గీతపనివారల సంఘం నాయకులు బొమ్మగాని నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కూనంనేని సాం బశివరావు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రను కమ్యూనిస్టు పార్టీ త్యాగాలను వేరు చేసి చూడ లేమన్నారు. సాయుధ పోరాటం నుండి రాష్ట్ర సాధన వరకు సిపిఐ అనేక పోరాటాలు, త్యాగాలను చేసిందన్నారు. 1945 నుండి సాగిన సాయుధ పోరాటంలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా మఖ్దూం మోహియుద్దీన్, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి వంటి మహామహుల పిలుపుతో సాగిన పోరాటంలో దాదాపు 5వేల మంది కమ్యూనిస్టులు ప్రాణత్యాగం చేశారని స్మరించుకున్నారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో సోనియా గాంధీ అన్ని పార్టీల మద్దతు కోరినప్పుడు, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కాంక్షిస్తూ మొట్టమొదటి సంతకం పెట్టిన జాతీయ పార్టీ సిపిఐ పార్టీయేనన్నారు. రాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లవుతున్నా ప్రజలు ఆశించిన ప్రజా తెలంగాణ ఇంకా సిద్ధించలేదని కూనంనేని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర 13వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం గన్ పార్క్ అమరవీరుల స్థూపం వద్ద ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన అమరవీరులకు, త్యాగ ధనులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుతోపాటు సిపిఐ నాయకులు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.

నిజాం కాలం నాటి తొలిదశ, మలిదశ తెలంగాణ ఉద్యమ చరిత్రను, అమరవీరుల గాథలను పాఠ్యాంశాల్లో చేర్చాలని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

# సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ ఆదర్శం

### అమరుల త్యాగాల ఫలమే స్వరాష్ట్రం: లోక్‌భవన్‌లో అవతరణ వేడుకల్లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



మంగళవారం లోక్‌భవన్‌లో జరిగిన అవతరణవేడుకల్లో మాట్లాడుతున్న గవర్నర్‌శివప్రతాప్ శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** సమగ్ర, సమ్మిళిత అభివృద్ధికి తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందనీ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. 'జై తెలంగాణ' అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, అది ఆత్మగౌరవం, ఐక్యత, స్వీయ గుర్తింపు కోసం సాగిన ఉద్యమానికి ప్రతీక అని రాష్ట్ర గవర్నర్ అన్నారు. ఆ స్ఫూర్తి నేటికీ తెలంగాణ ప్రజల హృదయాల్లో సజీవంగా ఉందని చెప్పారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో లోక్ భవన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, వారి సతీమణి జానకి శుక్లా తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అమరుల త్యాగాలు, ధైర్యసాహసాలు, ఆకాంక్షల ఫలితంగానే తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారమైందన్నారు. దక్కన్ పీఠభూమిపై ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్రం తన సుసం పన్నమైన నాగరిక వారసత్వాన్ని కాపాడుకుం టూనే ఆధునిక అభివృద్ధి దిశగా వేగంగా పయనిస్తోందని ఆయన పేర్కొన్నారు. సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం, సాంస్కృతిక పునరుజ్జీవనానికి తెలంగాణ నేడు ప్రతీకగా నిలి చిందన్నారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని గవర్నర్ చెప్పారు. అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా కృషి కొనసాగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నగరం సంప్రదాయం, ఆధునికతల సమ్మేళనానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు. భిన్న ప్రాంతాలు, భాషలు, మతాలకు చెందిన ప్రజలు సామరస్యంగా జీవిస్తున్న హైదరాబాద్ భారతదేశ వైవిధ్యానికి అద్దం పడుతోందన్నారు. 'వసుధైక కుటుంబకం' అనే భారతీయ తాత్విక భావన తెలంగాణలో ఆచరణ రూపం దాల్చిందని గవర్నర్ అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సంబరాలు భిన్న సంస్కృతులు, సంప్రదాయాల మధ్య సౌహార్దాన్ని, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలు, చారిత్రక వారసత్వం స్ఫూర్తితో తెలంగాణ మరింత ముందుకు సాగుతూ సమతుల్య, సమ్మిళిత, సుస్థిర అభివృద్ధికి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా అవతరిస్తుందని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు సందేశాలు పంపిన వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ఇతర ప్రముఖులకు గవర్నర్ కృతజ్ఞతలు తెలిపారు. 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' లక్ష్య సాధనలో తెలంగాణ మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలకు, అలాగే దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి తెలంగాణను తమ నివాసంగా మార్చుకుని రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన వారందరికీ గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ దక్షిణ రీజియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన కళా ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిన కళాకారుల పరేడ్ రాష్ట్ర అవతరణ వేడుకలను పురస్కరించుకొని లోక్ భవన్ కమ్యూనిటీ హాలులో డిప్యూటీ కార్యదర్శి పల్లవి పర్యవేక్షణలో ఒగ్గు డోలు, బోనాలు, గుస్సాడి, కోలాటం, డప్పు, బంజారా కళాకారులు నిర్వహించిన పరేడ్ తెలంగాణ ఘన సాంస్కృతిక వైభవాన్ని చాటింది. ఈ పరేడ్‌ను రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్‌శుక్ల ఆద్యాంతం ఆసక్తిగా తిలకించారు. కళాబృందాల వద్దకు గవర్నర్ దంపతులు ఆ కళా విశిష్టత, ప్రాము ఖ్యతను కళాకారులను అడిగి తెలుసుకున్నారు. కాగా, లోక్ భవన్ లో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ లుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ కు మహోన్నత సేవా పతకం, మట్టయ్యకు సేవా పతకంను వారి సేవలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో గవర్నర్ వారికి ప్రత్యేక మెమెంటో అందించి అభినందించారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం దాన కిషోర్, సంయుక్త కార్యదర్శి శశికిరణ్ చారి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ బాబు, హడ్కో రీజినల్ చీఫ్‌మేజర్ జనరల్ సుభాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మండలి,అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన చైర్మన్,స్పీకర్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ శాసన మండలి ప్రాంగణంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు విజయశాంతి, బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్, అంజిరెడ్డి, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నర్సింహాచార్యులు, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కార్యదర్శి రెండ్ల తిరుపతి, పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేపు తెలంగాణ ఉద్యమ కారుల గుర్తింపుపై అఖిలపక్షం

### పార్టీలకు లేఖ రాసిన జిఎడి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్ 2:** ప్రత్యేక రాష్ట్ర అవతరణ కోసం పోరాడిన తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 4న అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారిని సముచిత రీతిలో గౌరవించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ఈనెల 4న అన్ని పార్టీల ప్రతినిధులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించనుంది. డా.బీ.ఆర్.అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో 6వ అంతస్తులోని రూమ్ నెంబర్ 33లో 4వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరై తమ విలువైన సలహాలు, అభిప్రాయలు తెలిపేందుకు ఒక్కో పార్టీ నుండి ఇద్దరు ప్రతినిధులను నామినేట్ చేయాలని వివిధ రాజకీయ పార్టీలను కోరుతూ జనరల్ అడ్మినిస్ట్రేటీవ్ శాఖ(జీఏడీ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంగళవారం లేఖలు రాశారు. పార్టీల ప్రతినిధులు 4వ తేదీ సమా వేశానికి హాజరయ్యేందుకు సచివాలయంలోకి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రవేశించేం దుకు వీలుగా ముందస్తుగా తెలంగాణ రాష్ట్ర సచివాలయ చీఫ్ సెక్యూరిటీ అధికారి దేవీదాస్ ను సంప్రదించాలని ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.

# ఉన్నత విద్యా రంగంలో అన్ని వర్గాలను సమ్మిళితం చేయడమే లక్ష్యం

### తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్2:** మాసబ్ ట్యాంక్‌లోని తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రాంగణంలో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టా రెడ్డి జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉన్నత విద్యామండలి, వైస్‌చైర్మన్-1 ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, తెలంగాణ అడ్మిషన్ అండ్ ఫీజ్ రెగులేటరీ కమిటీ(ఏఎఫ్ఆర్‌సీ) చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ ఎ. గోపాల్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు సిబ్బంది రాష్ట్రవతరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో అన్ని వర్గాల సమ్మిళితత్వానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అభివృద్ధి చెందిన తెలంగాణ కోసం రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేసినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊహించినట్లుగా, "తెలంగాణ రైజింగ్ 2047 కి అనుగుణంగా ఉన్నత విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలను తీసుకురావడానికి తమవంతు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రాక్టికల్, నైపుణ్యం ఆధారిత అభ్యాసాన్ని చేర్చడం కోసం పరిశ్రమల నుండి సూచనలను కోరామని, డిజిటల్, సాంకేతికతకేంద్రీకృత అభ్యాసాన్ని చేర్చడం, పరిశోధన, ఆవిష్కరణల సంస్కృతిని పెంపొందించడంలో తన అనుభ వాలను ఆయన పంచుకున్నారు. ఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ రిటైర్డ్ జస్టిస్ ఎ.గోపాల్ రెడ్డి మా ట్లాడుతూ 1969లో న్యాయవ్యవస్థలో నియమితులైన తర్వాత తాను నిలిపివేయవలసి వచ్చిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో తన భాగస్వామ్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్ మాట్లాడుతూ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని ప్రత్యక్షంగా చూసిన తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు.

# మంచిర్యాలలో జాతీయ జెండాను ఆవిష్కరించిన ప్రభుత్వ సలహాదారు హార్కర వేణుగోపాల్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు హర్కర వేణుగోపాల్ రావ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయన అమరవీరుల స్థూపం వద్ద ఘన నివాళి అర్పించి అనంతరం కలెక్టర్ కార్యాలయంలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరణ చేశారు. పలువురు విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు, నృత్యాలను ప్రత్యక్షంగా తిలకించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన ప్రజలకు హర్కర వేణుగోపాల్ శుభాకాంక్షలు తెలిపారు పోలీస్ శాఖలో పని చేస్తున్న ఎఆర్ఎస్‌కి ఉత్తమ సేవా పథకం వికలాంగులకు బ్యాటరీ సైకిల్స్ స్కూటీ




వాహానాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ, ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావ్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, డీసీపీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలి: సిఎస్ రామకృష్ణారావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సీఎస్ రామకృష్ణారావు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి డీజీపీ సీవీ ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభల్లో పంటల వైవిధ్యీకరణపై రైతులకు సూచనలు చేయాలన్నారు. వర్షాకాల సన్నద్ధతపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. నీటి నిల్వల నివారణ, పారిశుద్ధంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ తెలిపారు. మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచాలని చెప్పారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎసహెచ్‌జీ సభ్యుల భాగస్వా మ్యంతో గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు సూచనలు చేశారు.





మంగళవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన దక్షిణాఫ్రికా వైస్ ప్రెసిడెంట్ పాల్ మషటిలే

## సజావుగా 'సర్'

>> పూర్తయిందని ఆయన తెలిపారు. భారత ఎన్నికల సంఘం అధికారులు స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్)పై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో భారత రాజ్యాంగంలోని సంబంధిత నిబంధనలు, ప్రజా ప్రాతినిధ్య చట్టం1950, ఓటర్ల నమోదు నియమాలు1960 గురించి వివరించారు. అలాగే ఎస్ఐఆర్ ప్రాముఖ్యతను వివరించి, ఈ ప్రక్రియలోని ముఖ్య దశలను, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల దాఖలు, నోటీసుల జారీ, వాటి పరిష్కారం, తుది ఓటరు జాబితా ప్రచురణ తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. గణన ఫారాలను నింపేటప్పుడు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఇఎస్ఐ అధికారులు సూచించారు. అధికారిక పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో గణన ఫారాల సమర్పణను విస్తృతంగా ప్రచారం చేయాలని, అలాగే ఓటర్లకు ఎస్ఐఆర్ గురించి త్వరితగతిన సమాచారం అందించే 'బుక్ ఎ కాల్' సదుపాయాన్ని కూడా ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. అలాగే జిల్లా ఎన్నికల అధికారులు క్రమం తప్పకుండా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి, బూత్ లెవల్ ఏజెంట్లను ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా భాగస్వాములను చేయాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా. వాసం వెంకటేశ్వర్ రెడ్డి, సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి ఎం. సత్యవాణి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, మేడ్చల్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. మనూ చౌదరి, అదనపు కార్యదర్శి, రాష్ట్ర మీడియా నోడల్ అధికారి ఎన్.శంకర్, డిప్యూటీ సీఈవో (ఎఫ్ఏసి) జి.ఎస్. చారి, రాష్ట్ర నోడల్ అధికారులు బి. చెన్నయ్య, ఎన్. ప్రసూనాంబ, పిఎం (ఐటి చిరంజీవి పాల్గొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జరిగిన పరస్పర చర్చా కార్యక్రమంలో ఇఆర్ఓలు, ఏఈఆర్ఓలు లేవనెత్తిన పలు సాంకేతిక, పరిపాలనా సందేహాలకు ఈసిఐ బృందం సవివరణలు ఇచ్చింది.

### ఇంటర్నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్

## కార్పొరేషన్ ఏర్పాటు

### డిజిటల్ కనెక్టివిటీ ఇక బలోపేతం

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** తెలంగాణలో డిజిటల్ సేవలను మరింత విస్తృతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ కనెక్టివిటీని మరింత బలోపేతం చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అమెండెడ్ భారత్ నెట్ (ఏబీపీ) పథకంలో భాగంగా తెలంగాణ రూరల్ ఇంటర్‌నెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఆర్ఐసీఎల్)ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఫైబర్‌గ్రిడ్ కార్పొరేషన్ (టీఫైబర్) ఎండీయే కొత్త కార్పొరేషన్ సీఈవోగా వ్యవహరిస్తారు. కొత్తగా ఏర్పాటైన రూరల్ ఇంటర్‌నెట్ కార్పొరేషన్ మండల కేంద్రాల నుంచి గ్రామాల మధ్య నెట్‌వర్క్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది. కార్పొరేషన్ నిర్వహణ, విద్యుత్ బిల్లులు, ఇతర అవసరాలకు ఏటా రూ.260 కోట్ల చొప్పున వచ్చే పదేళ్ల కోసం రూ.2,600 కోట్లు ఇచ్చేందుకు ఆమోదం తెలిపింది. భారత్ నెట్ ఉద్యమీ ప్రోగామ్ కింద తొలివిడతలో తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో 3లక్షల కనెక్షన్లు ఇవ్వాలని, ఒక్కో కనెక్షన్‌కు రూ.10వేల చొప్పున మొత్తం రూ.300 కోట్లు ఇస్తామని తెలిపింది. కేంద్ర టెలికమ్యూనికేషన్స్ శాఖ మార్గదర్శకాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమాన భాగస్వామ్యంతో ఈ సంస్థ పనిచేయనుంది. ఈ కార్పొరేషన్ బోర్డులో రాష్ట్రం తరఫున ఒక సీఈవోతోపాటు ఐటీ, ఆర్థిక, విద్యుత్, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు నలుగురు డైరెక్టర్లుగా ఉంటారు. కేంద్రం తరఫున ఎక్స్ అఫీషియో ఛైర్మన్, నలుగురు డైరెక్టర్లు ఉంటారు.

### పవన్‌ను తెర వెనుక నుండి ఎవరో వ్యక్తులు నడిపిస్తున్నారు: మహేశ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్2:** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పందించారు. పవన్ కళ్యాణ్‌పై తనకు ఉన్న వ్యక్తిగత అభిమానానికి, రాజకీయాలకు మధ్య స్పష్టమైన తేడా ఉందని ఆయన పేర్కొనారు. పవన్ కళ్యాణ్‌ను ఒక నటుడిగా తామంతా ఇష్టపడతామని, అయితే రాజకీయ పరంగా మాత్రం ఆయనను తీవ్రంగా వ్యతిరేకిస్తామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.'పవన్ కళ్యాణ్ ఆంధ్ర మూలాలు ఉన్న నాయకుడు. నటుడిగా ఆయనపై మాకుగౌరవం ఉంది, కానీ రాజకీయంగా మేము ఆయనతో విభేదిస్తాం' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్‌లో ఉపముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ.. ఆయనను తెరవెనుక నుంచి ఎవరో వేరే వ్యక్తులు నడిపిస్తున్నారని ఆరోపించారు.

## ముమ్ముందుకు తెలంగాణ

>> జీవిత బీమా" పథకాన్ని నూతనంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కుటుంబ పోషకుడు మరణించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. విద్యారంగంలో ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహార పథకాన్ని అమలు చేయనున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో 1,187 ప్రభుత్వ పాఠశాలల్లో 61,065 మంది విద్యార్థులకు అల్పాహారం అందించనున్నట్లు, 6,300 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు.
అభయహస్తం కార్యక్రమం క్రింద ఖమ్మం జిల్లాలో 59 వేల 448 కొత్త రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు 2,01,163 మంది కొత్త లబ్ధిదారులకు ఉచిత రేషన్ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ), పౌర సరఫరాల శాఖ, గృహ నిర్మాణ శాఖ, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ), రవాణా శాఖ రోడ్డు భద్రత అంశాలపై ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శనను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు.

## నేడో, రేపో 'నైరుతి'

>> మీదుగా ఈశాన్య తమిళనాడు వరకు సుమారు 0.9 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. తద్వారా రాబోయే ఐదు రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు 2 నుండి 3 డిగ్రీల వరకు తగ్గుతాయని అంచనా. ఇదిలా ఉండగా నైరుతు రుతుపవనాలు జూన్ 8 తర్వాత రాయలసీమలోకి ప్రవేశిస్తాయని, ఆ తర్వాత మూడు రోజులకు తెలంగాణలోనూ విస్తరిస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. నైరుతి రుతుపవనాల పురోగతితో నేటి నుంచి జూన్ 5 వరకు కేరళం వ్యాప్తంగా అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. వాతావరణంలో ఏర్పడిన ఎల్ నినో పరిస్థితుల వల్ల ఈసారి సాధారణం కంటే తక్కువ వర్షాలే కురుస్తాయని ఐఎండి అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు ఏర్పడుతున్నాయని, జూన్‌లో అవి బలహీనంగా ఉన్నా సెప్టెంబర్‌లో బలపడే అవకాశం ఉందని తెలిపింది.

## 3 నోటిఫికేషన్లు

>> ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) పోస్టుల భరీనతకి నోటిఫికేషన్ నంబర్ 02/జీ/ఆర్‌బీ/2026ను కమిషన్ జారీ చేసింది. 18 నుంచి 44 సంవత్సరాల వయోపరిమితిని విధించింది. దరఖాస్తులను జూన్ 8 నుంచి జులై 15 వరకు ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నట్టు ప్రకటనలో కమిషన్ కార్యదర్శి స్పష్టం చేశారు. నోటిఫికేషన్లకు సంబంధించిన పూర్తి సమాచారం కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.

### సిబిఎస్ఇ కొత్తచైర్మన్‌గా

## ప్రశాంత్ సీతారామ్

>> వారి తల్లిదండ్రులలో పెరుగుతున్న ఆగ్రహం, నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టింది. సిబిఎస్ఇ ఛైర్మన్, కార్యదర్శిని బదిలీ చేసింది.
ఆన్‌స్క్రీన్ మార్కింగ్ వివాదంపై సమగ్ర విచారణ జరిపేందుకు కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ చైర్మన్ ఎస్. రాధా చౌహాన్ నేతృత్వంలో ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించింది.

### వారం - వర్జ్యం

03-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
తదియ రా.9.20, పూర్వాషాఢ రా.12.59
వర్జ్యం : ఉ.8.51-ఉ.10.38
దు.ఉ.11.39-12.31
శుభసమయం : ఉ.6.30-7.00
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** కొన్ని ప్రయోజనములను అందరితో కలిసి వంచుకొనుటకు సిద్ధ పడతారు. కోర్టుకేసులు పరిష్కారం అవుతాయి.

**వృషభం:** కుటుంబము నందు ఇతరుల అతి జోక్యము ఇబ్బందిని కలిగిస్తుంది. వ్యాపార విస్తరణ ఆలోచనలు ముమ్మరం చేస్తారు.

**మిథునం:** స్థిరాస్తుల కొనుగోలు విషయములో పెద్దలను సంప్రదించుట మంచిది. వివాదాలకు దూరంగా వుండటం మంచిది.

**కర్కాటకం :** కార్యాలయము నందు మీకు తెలియకుండా కొన్ని కార్యాకలాపములు జరుగుతాయి. కావున జాగ్రత్త అవసరము.

**సింహం:** పెండింగ్ పనులు పూర్తి కాగలవు. పట్టుదలతో ఎంతటి కార్యాన్నైనా సాధిస్తారు. వాహన సౌకర్యం కలదు.

**కన్య :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. కాంట్రాక్టులు దక్కించు కుంటారు. వృత్తిలో ప్రోత్సాహకరంగా ఉంటుంది.

**తుల :** దూరపు బంధువులను కలిసి సంతోషంగా గడుపుతారు. తండ్రి తరపు నుండి ఆస్తి లాభం పొందుతారు.

**వృశ్చికం:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. దీర్ఘ కాలిక ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**ధనుస్సు:** సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడుతాయి. నూతన విద్యావకాశాలు కలవు.

**మకరం:** భూములకు సంబంధించి వివాదాలు తొలగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రలాభం కలదు.

**కుంభం:** ఓర్పు, నేర్పులతో ముఖ్య వ్యవహారాలు సానుకూల పరచుకునే యత్నాలు చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా ఉండండి.

**మీనం :** ఎంతటి వారినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుని పనులు పూర్తి చేస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# సంక్షేమంలో టాపర్



మంగళవారం గన్‌పార్క్ వద్ద అమరవీరులకు నివాళి అర్పిస్తున్న సిఎం రేవంత్

>> ఎవరెన్ని విమర్శలు, కుట్రలు చేసినా ప్రజలు మాకు అండగా నిలవడం ఎనలేని శక్తిని ఇచ్చిందన్నారు.. రైతులు, యువత, ఆడబిడ్డల ఆకాంక్షలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద వర్గాల సామాజిక న్యాయం, సమగ్ర అభివృద్ధి సాధన కోసం పలు విధాన నిర్ణయాలు తీసుకుంటూ, కార్యచరణ చేసుకుంటూ రెండున్నరేళ్లుగా నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం ఒక ఎత్తు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం మరో ఎత్తు. తెలంగాణ ఆవిర్భావం ఒక ప్రత్యేక ఘట్టం. దశాబ్దాలు ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్నది కేవలం సంక్షేమం, అభివృద్ధి కోసం కాదు. ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కోసం ఈ గడ్డపై ప్రతి బిడ్డ పోరాటం చేశారు అని చెప్పారు. పెత్తందారీ తనానికి వ్యతిరేకంగానే పోరాటాలు జరిగాయి. నాటి రాచరికం నుంచి నిన్నటి నియంతృత్వం వరకు తెలంగాణ తిరుగుబాటు చరిత్ర మొత్తం చెబుతున్న సత్యం ఇదే అని చెప్పారు. రాచరిక ఆలోచనలు, నియంతృత్వ పోకడలను ఓడించి కొత్త చరిత్రను రాసుకోవడం కోసం మీరు ప్రజా ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. ఈ రోజు ప్రజల మనోభావాలకు మేం ప్రతినిధులం. సమాజ ఆకాంక్షలకు మేం వారధులం. అందుకే మీరిచ్చిన ఈ అవకాశాన్ని మేం అధికారం.. అని సంభోదించడం లేదు. మమ్మల్ని మేం పాలకులుగా అనుకోవడం లేదు. మీకు సేవకులుగా బాధ్యత నిర్వర్తిస్తున్నాం అని చెప్పారు. రకరకాల అడ్డంకులు అధిగమిస్తూ 30 నెలల్లోనే ప్రజల ఆశలు, ఆశయాలను నెరవేర్చడంలో విజయవంతంగా ముందుకు సాగుతున్నామన్నారు. సాగు భూమి, వ్యవసాయం, రైతు ఈ మూడు తెలంగాణకు ఊపిరి. వ్యవసాయం వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు అనుబంధ రంగాల విషయంలో తెలంగాణ నెంబర్ వన్ గా ఉండాలన్న లక్ష్యంతో, రైతుల జీవితాల్లో గణనీయమైన మార్పు తేవాలన్న సంకల్పంతో 'తెలంగాణ రైజింగ్ 2047" విధాన పత్రంలో ప్రాధాన్యత అంశంగా తీసుకున్నామన్నారు. రైతులు కేవలం పంటలు పండించడమే కాదు... వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా ఈ ప్రణాళిక ఉంటుంది. అగ్రికల్చరల్ ఏకో సిస్టమ్ అభివృద్ధి చేసి, రైతులను శ్రీమంతులుగా చేయాలన్న సంకల్ప పత్రం రూపొందించామన్నారు. 2025-26 అంచనాల ప్రకారం మన ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయిలో 236.87 లక్షల మెట్రిక్ టన్నులుగా నమోదైంది. ప్రజా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకంతో వరి, మొక్కజొన్న, పత్తి పంటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. పశు సంపద, మత్స్య రంగాలు గణనీయమైన వృద్ధి సాధించాయన్నారు. రైతులు విభిన్న పంటల ఉత్పత్తితో తెలంగాణను సకల పంటల క్షేత్రంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. ఈ రెండున్నరేళ్లలో వ్యవసాయానికి, రైతు సంక్షేమానికి రూ.1 లక్షా 56 వేల 496 కోట్లు ఖర్చు చేశాం. రైతు భరోసా పెట్టుబడి సాయం కింద ఇప్పటి వరకు రూ.27 వేల 529 కోట్లు నేరుగా రైతుల ఖాతాలలో వేశామన్నారు. గత ఏడాది వానాకాలం రైతు భరోసా పెట్టుబడి సహాయ పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.8 వేల 744 కోట్లను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేశాం. ఈ ఏడాది ఇప్పటికే 5 వేల 700 కోట్ల రూపాయల రైతుభరోసా నిధులను నేరుగా రైతు ఖాతాలలో జమచేశామని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత ఇప్పటి వరకు రెండున్నరేళ్లలో ధాన్యం కొనుగోళ్లకు రూ. 82 వేల 840 కోట్లు ఖర్చు పెట్టినం. ఈ యాసంగి సీజన్లో రాష్ట్రమంతా 8575 కొనుగోలు కేంద్రాల ద్వారా చురుగ్గా ధాన్యం సేకరణ జరుగుతోంది. ఇప్పటివరకు 63.65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. సుమారు రూ.11 వేల 903 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశాం అని చెప్పారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిపోయిన చోట రైతు నష్టపోకూడదని దాదాపు 10 వేల మెట్రిక్ టన్నుల తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ధాన్యం కొనుగోళ్లలో దేశంలో ఏ రాష్ట్రం కూడా మనతో పోటీపడే పరిస్థితి లేదు. దేశంలో యాసంగి సీజన్‌లో సేకరించిన మొత్తం ధాన్యంలో తెలంగాణ వాటా 60 శాతం నమోదైందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో జొన్న, మొక్కజొన్న పంటల సాగు భారీగా పెరిగింది. ఈ యాసంగిలో సుమారు 16 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 4 లక్షల ఎకరాల్లో జొన్న సాగు చేసి తెలంగాణ రైతులు కొత్త చరిత్ర సృష్టించారు. మొక్కజొన్నల కొనుగోళ్లకు సుమారు రూ.4 వేల 275 కోట్లు, జొన్న కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ.1,154 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాలు తేల్చి, ప్రాజెక్టులు పూర్తి చేసే విషయంలో తమ ప్రభుత్వం చిత్త శుద్ధితో ఉంది. ఈ విషయంలో ఏ వేదిక పైన ఐనా రాజీ లేకుండా, లౌక్యంతో, రాజకీయ విజ్ఞతతో పని చేస్తామన్నారు. తెలంగాణకు వర ప్రదాయని ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టుకు తిరిగి ప్రాణం పోసే ప్రయత్నం చేస్తున్నాం. మహారాష్ట్ర ముఖ్యమంత్రికి ఇటీవలే లేఖ రాశాను. వారితో చర్చించి, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించే కార్యాచరణ చేపడుతామన్నారు. గత ప్రభుత్వం లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మూడేండ్లకే కుంగిపోయింది. దీనికి మరమ్మతులు చేయించే భారం ప్రభుత్వంపై పడింది. ప్రజా శ్రేయస్సు, ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పునరుద్ధరించే పనులు మొదలు పెట్టామని తెలిపారు. ఆర్థిక సాధికారతలో తెలంగాణ మహిళ దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. పొదుపు నుంచి పారిశ్రామికవేత్త వరకు తన శక్తిని చాటి చెబుతోంది. ప్రజా ప్రభుత్వం అందిస్తోన్న ప్రోత్సాహంతో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మన మహిళా సంఘాలు ఇప్పుడు ఆర్థిక శక్తి కేంద్రాలు. ఆడబిడ్డలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే క్షేత్రాలు. బ్యాంకు లింకేజీ స్త్రీ నిధి ద్వారా ఈ సంఘాలకు రూ.లక్ష కోట్లు రుణాలుగా ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఇప్పటికే 60 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలను పంపిణీ చేశాం. రూ.5 లక్షల రుణపరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. ఇందిరమ్మ క్యాంటీన్లు, సౌర విద్యుత్తు ప్లాంట్లు, పెట్రోల్ బంకులను మహిళలు నేడు యజమానులు. 1000 బస్సులకు వాళ్లు ఓనర్లు. ఇందిరా మహిళా శక్తి సూపర్ బజార్లు, లాజిస్టిక్ హబ్‌లు, గోదాములు, రైస్ మిల్లులు ఏర్పాటుకు వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దేశంలోని జీసీసీల్లో దాదాపు 20 శాతం హైదరాబాద్లోనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు తెలంగాణ టూరిజం పాలసీని రూపొందించుకున్నాం. దీంతో దాదాపు మూడు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. దావోస్లో న్యూ నెక్ట్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించుకున్నాం. 2030 నాటికి తెలంగాణ టాప్ లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా నిలబెట్టాలనేది లక్ష్యం. దీంతో రాబోయే రోజుల్లో 5 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మరోవైపు పేదల జీవన స్థితిగతులు ఎలా ఉంటాయో తనకు తెలుసని తెలిపారు. అందుకే ఇందిరమ్మ ఇండ్ల కోసం రూ.22,500 కోట్లు కేటాయించి 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు.

**8 మంది ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌కు సిఎం సత్కారం**

పంజాగుట్ట నాగార్జున సర్కిల్లో జరిగిన భారీ అగ్నిప్రమాదాల్లో తన ప్రాణాలను పణంగా పెట్టి,ఒక దివ్యాంగుడితో సహా 8 మందిని కాపాడిన ట్రాఫిక్ కానిస్టేబుల్ శ్రవణ్‌కుమార్‌ను తెలంగాణ ప్రభుత్వం జీవన్ రక్షా పదక్-2024తో సత్కరించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ అవార్డును అందజేశారు. ఆయన సాహసానికి పోలీస్ శాఖ గర్విస్తోందని అధికారులు ప్రశంసలు అందించారు.



న్యూఢిల్లీలో మంగళవారం రాహుల్, ఖర్గేలతో భేటీ అయిన డికె శివకుమార్, సిద్ద రామయ్య

# మీ అయ్య జాగీరా?

>> జాగిరా.. తెలంగాణ అన్నారు. మీ ఇష్టానికి మాట్లాడితే నేను భయపడాలా..?, నాపై దాడులు చేస్తామంటున్నారు కొందరు అందుకే తన చిరునామా తెలియాలని ఇంటి వద్దనే మీడియా సమావేశం ఏర్పాటుచేశానన్నారు. తనకు తెలంగాణాలో బెదిరింపులకన్నా, ఆంద్రాలోనే బెదిరింపులు ఎక్కువన్నారు.
తెలంగాణాపై తనకు కమిట్‌మెంట్ ఉందని, కొండగట్టు అంజన్నకు రూ. 30 కోట్లు, వరదలు వచ్చినప్పుడు కోటి రూపాయలు ఇచ్చామన్నారు. తెంలగాణాలోనే తనపై తొలి కేసు నమోదైందని గుర్తుచేశారు. తెలంగాణ యువతకు అద్భుతమైన అవకాశాలు రావాలని కోరుకునే వ్యక్తిని తానని అన్నారు. ఆంద్రాలో తనను తిరగనివ్వమంటే తెలంగాణాలో తన వారాహి వాహనానికి తెలంగాణ ప్రజలే అనుమించారన్నారు. తనకు ఎన్నో ఏళ్లుగా ప్రజలు అండగా నిలిచారని, జనసేనను తెలంగాణ నడిబొడ్డున ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణలో పార్టీ బలోపేతం చేయాలని జనసేన నేతలు చాలా సార్లు అడిగారని, ఆంద్రాలోనే అధికారం కోరుకోలేదని, తెలంగాణాలో అధికారం ఎందుకు కోరుతానని స్పష్టం చేశారు. తనకు అధికారంపై ప్రేమ కాదని, మార్పుపైన మాత్రమే అని అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆంద్రాపై విద్వేషం లేదని, తెలంగాణ ప్రజలు ద్వేషం పెంచుకుంటే ఏపీకి సంబంధించిన వారు ఇక్కడ ఉంటారా అంటూ ప్రశ్నించారు. తెలంగాణ నలుమూలల తిరిగిన వ్యక్తినని, ఇప్పుడు నన్ను విమర్శించే వాళ్లు అదిలాబాద్ అడవుల్లో తిరగలేదని, తాను తిరిగానని స్పష్టం చేశారు. తాను బెదిరింపులకు లొంగే వాడిని కాదని, రాష్ట్ర విభజనను తాను ఎప్పుడు వ్యతిరేకించలేదని, విభజన జరిగిన తీరునే వ్యతిరేకించానని అన్నారు. సామాజిక తెలంగాణ రావాలని చెప్పి మరీ వచ్చానన్నారు. పార్లమెంటు తలుపులు మూసి విభజించిన తీరు తప్పని చెప్పానన్నారు. తెలంగాణ వ్యతిరేకం కాదని వైఎస్ చెప్పినా, ఆయనకు ఊడిగం చేశారంటూ పవన్‌కళ్యాణ్ ఆరోపించారు. తెలంగాణాను ఎంఐఎం, సీపీఎం వ్యతిరేకించాయని, ఆ రెండు పార్టీలను ఎందుకు ప్రశ్నించారన్నారు. తాను ఈ 12 ఏళ్ల కాలంలో తెలంగాణ గురించి, తెలంగాణ నేతల గురించి ఒక్క మాట మాట్లాడలేదన్నారు. తనకు రెచ్చగొట్టడం ఇష్టంలేదన్నారు. గద్దర్ బతికిన్న రోజుల్లో మీరంతా ఎక్కడ ఉన్నారని, గద్దర్ వచ్చి తనకు బండి కొనివ్వాలంటే రెండు రోజుల్లో కొనిచ్చానన్నారు. గద్దర్ బతికున్న రోజుల్లో ఆయనకు మీరేం చేశారన్నారు. ఒక విశ్లేషకుడి వ్యాక్యల వల్ల గొడవ మొదలైందని, ఆ విశ్లేషకుడిపై కేసులు పెట్టిన విషయం తనకు తెలియదని, తెలిసిన తరువాత కేసులు వద్దని తానే వారించనని స్పష్టం చేశారు. విశ్లేషకుడై ఉండి అమిత్‌షా గురించి తప్పుగా ఎలా మాట్లాడుతారంటూ ప్రశ్నించారు. తనపై ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్‌లు పెట్టి తనను తిట్టారని, తెలంగాణాలో ప్రతి సమస్యకు ఆంద్రావారే కారణమా అని అన్నారు.
ప్రత్యేక తెలంగాణ కోరుకొనే మర్రి చెన్నారెడ్డి వల్లే సినీ పరిశ్రమ చెన్నై నుంచి నగరానికి వచ్చిందన్నారు. తెలుగు ప్రజలు 50 ఏళ్లు కలిసి ఉన్న రాజధాని హైదరాబాద్ అని, తెలంగాణకు అన్యాయం చేసిన పాలకులను ఉరితీసినా పర్వాలేదన్నారు. పాలకులు వేరు, ప్రజలు వేరని, పాలకులను తిట్టండి.. ప్రజలను కాదని అన్నారు. దేశంలో ఎన్నో ప్రాంతాల్లో తెలుగువారు ఉన్నారని, అక్కడి ప్రజలు మన తెలుగు ప్రజల్ని పంపిస్తే మన పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తాను చెరువును ఆక్రమించానని, స్థలాన్ని కబ్జా చేశానని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్పష్టం చేస్తున్నా..! ఒకవేళ తాను కబ్జాకు పాల్పడినట్లు నిరూపణైతే ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవచ్చని, తానే ప్రభుత్వానికి రాసిస్తానన్నారు. కేసీఆర్ బీఆర్ఎస్ పెట్టి ఏపికి వచ్చినప్పుడు తాను స్వాగతించానని, జనసేన మాజీ నేతలను బీఆర్ఎస్‌లోకి తీసుకున్నా స్వాగతించానన్నారు. కేవలం 2వేల మందితో సభ పెట్టుకుంటామంటే అనుమతి ఇవ్వరా..? విశ్లేషకులు ఇష్టానుసారం మాట్లాడినా మా అభిప్రాయం చెప్పకూడదా..? ఇలాంటి విశ్లేషకుల వల్ల కమ్యూనిజం చనిపోయిందన్నారు. తెలంగాణ నేల నేర్పించిన విలువలనే పార్టీ సిద్ధాంతాలుగా పెట్టుకున్నానని, చచ్చిపోయేందుకు సిద్ధపడే పార్టీ పెట్టానని అన్నారు.

**ఆరోపణల వెనుక రేవంత్‌రెడ్డి, కేసీఆర్ లేరు**

ప్రాంతీయత పేరుతో జాతీయ వాదాన్ని బలహీన పరిస్తే జనసేన అంగీకరించదన్నారు. ప్రాంతీయవాదం తీసుకొస్తే దేశ సుస్థిరత దెబ్బతింటుందన్నారు. ఉగ్రవాదం కంటే ప్రాంతీయవాదం హానికరం అన్నారు. రాహుల్, ప్రియాంక దక్షిణాదిలో ఎక్కడైనా పోటీ చేయవచ్చని, ఇందిరాగాంధీ మెదక్‌లో, పీవీ నర్సింహారావు నంద్యాలలో పోటీ చేయలేదా అంటూ ప్రశ్నించారు. ప్రంతీయ వాదమే .. కాంగ్రెస్ వాదమా..? అంటూ ప్రశ్నించారు. జాతీయ పార్టీ ప్రాంతీయ వాదం మాట్లాడొచ్చా అన్నారు. తాను ప్రెస్‌మీట్ పెడితే శాంతిభద్రతల సమస్య అవుతుందా..? తనపై విమర్శల వెనుక రేవంత్‌రెడ్డి, కేసీఆర్ ఉన్నారని తాను అనుకోవడం లేదన్నారు. ఎపి-తెలంగాణ హైవేకు బూర్గుల పేరు పెట్టాలని, ఆయన విగ్రహాన్ని హైవేపై పెట్టాలన్నారు. తాను రాష్ట్ర విభజన తీరుకు వ్యతిరేకంగానే 11 రోజులు అన్నం తినలేదని, విభజించినందుకు కాదని పవన్‌కళ్యాణ్ స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన నేతలు శంకర్‌గౌడ్, రాధారపు రాజలింగం, సాగర్, తనీష్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్య జాగీరే

>> తెలంగాణ అంతర్భాగవేనని, అనేక సందర్భాల్లో తెలంగాణ వాళ్లు ఆంధ్రకి వెళ్తారు.. ఆంధ్ర వాళ్ళు తెలంగాణకు వస్తారన్నారు. హైదరాబాద్‌ను పాకిస్తానా? ఇండియానా? అన్నట్టు పవన్ మాట్లాడుతున్నారన్నారు. తెలంగాణకు రావాలంటే పాస్ పోర్ట్ తీసుకోవాలా అనే మీ మైండ్ సెట్ మార్చుకోండని హితవు పలికారు. పార్లమెంట్లో తెలంగాణ బిల్లు అయినప్పుడు నేను ప్రత్యక్ష సాక్షి నని, మీకు తెలిసి మాట్లాడుతున్నారా అని ప్రశ్నించారు. పార్లమెంట్ తలుపులు వేసి తెలంగాణ బిల్లు తెచ్చుకున్నారని మాటలు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ తెలంగాణపై అక్కసు వెళ్లకక్కుతున్నారని పొన్నం మండిపడ్డారు. తెలంగాణ మీద ప్రేమ ఉంది అంటున్నారు, తెలంగాణకు మద్దతుగా ఎప్పుడైనా మాట్లాడారా?, తెలంగాణ అమరవీరులు చనిపోతుంటే ఎప్పుడైనా సంఘీభావం తెలిపారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పడితే 11 రోజులు అన్నం తినలేదు అని చెప్పిన వాడివి, తెలంగాణ ఏర్పాటును అవమానించిన వ్యక్తివి, మీరు మాట్లాడితే ఎట్లా రాజకీయంగా వక్ర భాషా చెప్పే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పవన్ కళ్యాణ్ పెయిడ్ ఆర్టిస్ట్ అని, నా దగ్గర డబ్బులు ఉంటే నేను కూడా ఆయనకు పాత్రకు ఎంగేజ్ చేసి మాట్లాడించే అవకాశం ఉండేదన్నారు. ఆయనకు వచ్చే చిట్టీలు బిజెపి నుండి వస్తున్నాయా? టిఆర్ఎస్ నుండి వస్తున్నాయా? తెలుస్తలేదన్నారు. చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునే వాతావరణం కలుగజేస్తున్నామన్నారు. మీరు కొండగట్టు వస్తే తెలంగాణ గెస్ట్‌గా ప్రోటోకాల్ ఇచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజు ప్రజలకు శుభాకాంక్షలు చెప్తూ ఇది ప్రజల ఆకాంక్ష నెరవేర్చుకున్న రోజు అని కోరుకోకుండా, నవనిర్మాణ సభ అని ఏం చేస్తావని ప్రశ్నించారు. 2009, 2014 ఎన్నికలప్పుడు తిరిగినప్పుడు జనం వస్తుండొచ్చు, ప్రేక్షకులుగా నటుడిని గౌరవిస్తూ ఈలలు కొడుతుంటే అదంతా నీ బలం అనుకుంటే ఏంచేస్తామన్నారు. తెలంగాణకు రావడానికి పోవడానికి ఎలాంటి అభ్యంతరాలు లేవని, కానీ ఆవిర్భావ దినోత్సవం రోజు గెలికి నవ నిర్మాణ సభపెడతా అంటే ఎవరు చూస్తూ ఊరు కోరన్నారు. ఆంధ్ర ప్రాంత ప్రజలకు తెలంగాణ ఎప్పుడు స్వాగతం పలుకుతుందని, ఎప్పటికీ వ్యతిరేకం కాదన్నారు. తెలంగాణలో ఆంధ్రావాల్లకి పని లేదని తాము అనడం లేదని, ఇది ఫెడరల్ సిస్టమని అన్నారు. హైదరాబాద్‌లో అని భాషల వాళ్ళు ఉంటారు.. అనవసరంగా గెలకకు పవన్.. గుజరాత్‌లో పార్టీ పెట్టుకోమని సూచించారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ విగ్రహాల ప్రస్తావన తెచ్చిన పవన్ కళ్యాణ్ ఎంత ధైర్యమని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ మీరు తెలంగాణలో తిరుగుతుంటే ఎవరు వద్దన్నారన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.



ఉత్తమ సేవలందించిన వారిని సన్మానిస్తున్న సింగరేణి యాజమాన్యం

## అంతర్జాతీయ స్థాయికి సింగరేణి లక్ష్యం

### విధులు సమర్ధంగా నిర్వహిస్తే సంస్థ అభివృద్ధి

### రాష్ట్ర అవతరణ వేడుకల్లో సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** తెలంగాణ లో ప్రధానమైన సింగరేణి కాలరీస్ సంస్థను అంతర్జాతీయ స్థాయికి చేర్చడమే రాష్ట్రానికి మనం అందించే గౌరవం అని, ఆ దిశగా ప్రతీ ఒక్కరూ తమ తమ బాధ్యతలను అంకితభావంతో నిర్వహించాలని సింగరేణి సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ సింగరేణి సంస్థ తెలంగాణ రాష్ట్రానికే కాక, ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరిస్తుందని క్రమంగా అంతర్జాతీయంగా విస్తరించడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనేకమంది యువకులు, నాయకులు త్యాగాలు చేసిన ఫలితంగా తెలంగాణ ఏర్పడిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని, ఇక్కడ యువత ఉద్యోగాలు సాధించగలిగారని వివరించారు.

సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు ఉందని, అయితే ఓపెన్ కాస్ట్ గనులు, భూగర్భ గనులలో యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలని, నాణ్యత మెరుగుపరుచుకోవాలని సూచించారు. అంతకు ముందు ఆయన తెలంగాణ తల్లి, అమ రవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, అనం తరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తెలం గాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ సేవలందించిన ఎల్. శ్రీనివాస్ (ఏజీఎం పర్చేస్), వై. లక్ష్మీ నారాయణ (ఎంవీ డ్రైవర్), డి. రుద్రమ్మ (ఔట్ సోర్సింగ్ ఉద్యోగి) లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పోట్రు గౌతమ్, జనరల్ మేనేజర్ టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు కరెంట్ బిల్లులు వారంలో సరిచేయాలి

### విద్యుత్ డిస్కంలకు నియంత్రణ కమిషన్ ఆదేశాలు

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** కరెంటు వినియోగానికి సంబంధించిన బిల్లుల్లో తప్పులు చోటు చేసుకున్నట్లయితే వాటిని త్వరితగతిన పరిష్కరించాల్సిన బాధ్యత విద్యుత్ పంపిణీ సంస్థలపై ఉందని తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ స్పష్టం చేసింది. విద్యుత్ పంపిణీ సంస్థలు జారీ చేసిన తప్పుడు బిల్లులను వినియోగదారుడు గుర్తించి, ఫిర్యాదు చేస్తే వాటిని వారం రోజుల్లోపు సరిచేయాలని తెలిపింది. తప్పుడు బిల్లు కారణంగా వినియోగదారుడు ఆమేరకు ఇదివరకే చెల్లింపులు చేసి ఉంటే వసూలు చేసిన మొత్తంపై 18 శాతం వార్షిక వడ్డీని లెక్కకట్టి తదుపరి బిల్లుల్లో సర్దుబాటు చేయాలని నిర్దేశించింది. ఈ మేరకు తెలంగాణ రెగ్యులేటరీ కమిషన్ మార్గదర్శకాలను జారీ చేసింది. లోపాలతో జారీ చేసిన బిల్లును కట్టని పక్షంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడానికి వీల్లేదని గుర్తుచేసింది. వారంలో కొత్త బిల్లు జారీ చేసి, అందులో కొత్త చెల్లింపు తేదీని పేర్కొనాలని సూచించింది. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా, రీడింగ్ లోపాలు మరియు తప్పుడు బిల్లింగ్‌లను త్వరితగతిన సరిదిద్దాలని పేర్కొంది. కాగా తప్పుడు విద్యుత్ బిల్లుల సమస్య పరిష్కారానికి సహాయ కేంద్రాలను సంప్రదించాల్సి ఉంటుంది. బిల్లుల్లో తప్పులుంటే వెంటనే 1912 (టోల్‌ఫ్రీ నంబర్) కు కాల్ చేసి సమస్యను నమోదు చేయాలి. ఈ విధంగా ఫిర్యాదు చేసినప్పుడు సంబంధిత అధికారి ఇచ్చే కంప్లైంట్ ఐడీని భద్రపరుచుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ గడువులోగా తప్పుడు బిల్లుల సమస్య పరిష్కారం కాకపోతే, పరిధిలోని సహాయ విద్యుత్ ఇంజనీర్, డివిజనల్ కార్యాలయాన్ని సంప్రదించాల్సి ఉంది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోతే, విద్యుత్ శాఖలోని వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక లేదా విద్యుత్ లోక్‌పాల్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ఉంటుంది.

## ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు

### నాణ్యమైన విద్యుత్ అందించే దిశగా టెక్నాలజీ

### ఉత్తర తెలంగాణ విద్యుత్ సంస్థ సిఎండి వరుణ్‌రెడ్డి

**హైదరాబాద్, జూన్ 2, ప్రభాతవార్త:** వినియోగ దారులకు సంబంధించి ప్రతి ఒక్క అంశాన్ని సాంకేతికంగా పర్యవేక్షించుకుని త్వరితగతిన సేవలను అందించేందుకు విద్యుత్ భవన్‌లో ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (ఎన్పీడీసీఎల్) సిఎండి కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. దీన్ని దేశంలోనే అత్యంత ఉత్తమమైన ఆపరేషన్ కంట్రోల్ సెంటర్‌గా తీర్చి దిద్దుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం నుంచి విద్యుత్ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భాంగా మాట్లాడుతూ ఆర్టిఫిషియల్లీ ఇంటెలిజెన్స్ (ఏఐ) ద్వారా ప్రతి ఒక్క పని సులువు అవుతుందని, ఉద్యోగులకు డాష్ బోర్డు ఏర్పాటుచేశామన్నారు. అందులో ప్రతి ఒక్క వింగ్ కు సంబంధించిన సమాచారాన్ని చూసుకునే వెసులు బాటు ఉంటుందని, తద్వారా పని సులువుగా, వేగంగా, పారదర్శకంగా జరుగుతుందని చెప్పారు. ఆర్థికంగా మరింత బలోపేతం దిశగా అన్ని చర్యలు తీసుకోవాలని, ట్రాన్స్మిషన్ డిస్ట్రిబ్యూషన్ నష్టాలను తగ్గించుకోవాలని తెలిపారు. సబ్ స్టేషన్లలో సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ గ్రిడ్ కు అనుసంధానం వల్ల నష్టాలు చాల వరకు తగ్గుతాయని పేర్కొన్నారు. అటవి ప్రాంతం గుండా వెళ్లే సుదూర లైన్లలలో కవర్డ్ కండక్టర్ ఏర్పాటు చేస్తున్నామని, అలాగే సబ్ స్టేషన్లలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టం పెడుతున్నామన్నారు. తద్వారా ఏజెన్సీ ప్రాంతాలలో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గించవచ్చున్నారు. జిఐఎస్ మ్యాపింగ్ ద్వారా ప్రతి ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్, విద్యుత్ లైన్, వినియోగదారుని డిజిటల్ మ్యాప్‌లో నమోదు చేయడం వల్ల నెట్‌వర్క్ ప్రణాళిక, లోపాల గుర్తింపు ద్వారా పనులు మరింత వేగవంతం అవుతున్నాయని వివరించారు. రియల్ టైమ్ ఫీడర్ మానిటరింగ్ సిస్టమ్ ఫాల్ట్ ప్యాసేజ్ ఇండికేటర్స్, టెక్నాలజీ ద్వారా సేవలు వేగంగా అందుతున్నాయని వెల్లడించారు. అందరం కలసి కట్టుగా పని చేసి వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంగా నిబద్ధతో పనిచేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం ఆయన 156 మంది ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి మోహన్ రావు, వి తిరుపతి రెడ్డి, టి మధుసూదన్, సి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పవన్ ఇమేజ్‌కి మేము భయపడ లేదు: అద్దంకి దయాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** జనసేన అధినేత, ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సినిమా గ్లామర్, ఇమేజికి తాము ఏమీ భయపడడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తెలిపారు. తెలంగాణ ఆవిష్కరణ రోజు పవన్ కళ్యాణ్ నవ నిర్మాణ సభ కోసం పోలీసుల ముందు అనుమతి కోరితే, శాంతిభద్రతల సమస్య వస్తుందని,పైగా ఆ హాలు చిన్నగా ఉన్నదని భావించి అనుమతి ఇవ్వలేదని ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్ ప్రజల మధ్య వైషమ్యాలు చెలరేపే కుట్ర చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడీ, బిజెపి కలిపి పవన్ కళ్యాణ్‌ను బలి చేయవద్దని, పవన్‌కి రాజకీయం ఏమి తెలియదని అన్నారు.

బిజెపికి అనుకూలంగా పవన్ మారారని ఆయన తెలిపారు. చేగువేరా వారసుడిగా ఉండి హిందూ ధర్మాన్ని నమ్మడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్‌ను బిజెపి పావుగా వాడుకుంటోందని ఆయన విమర్శించారు. ధాన్యం కొనులు చేయాలని కేంద్రంపై వత్తిడి తెచ్చే సత్తా బిజెపి రాష్ట్ర నాయకులకు గానీ, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులకు గానీ లేదని ఆయన విమర్శించారు. తెలంగాణ సెంటిమెంట్‌తో బిఆర్ఎస్‌ను పెద్దగా చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆయన విమర్శించారు.

తెలంగాణ ప్రజలు శాంతియుతంగా ఉండడం మీకు ఇష్టం లేదా..? అని ఆయన ప్రశ్నించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సఖ్యత వాతావరణ ఉండాలని తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని, తెలంగాణ ఆత్మగౌరం మీద దెబ్బకొడితే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు.

పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ నేతలు ఎందుకు స్పందించలేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణ బిజెపి నేతలకు ఆత్మగౌరవం లేదని ఆయన విమర్శించారు.ఏపీ ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ కళ్యాణ్‌కు తాము గౌరవం ఇస్తున్నామని ఆయన తెలిపారు.

# 2028 డిసెంబర్‌లో మళ్లీ సిఎంగా కెసిఆర్ ప్రమాణం

## తెలంగాణ భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** సంక్షేమంలో ఉన్న తెలంగాణ సంక్షోభంలో కూరుకుపోయిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అడ్డదారిలో అధికారంలోకి వచ్చిందని అన్నారు. తెలంగాణ భవన్ లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో కెటిఆర్ పాల్గొన్నారు. అమరవీరులకు నివాళులు అర్పించిన అనంతరం జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..కెసిఆర్ మీద సినిమా తీయాలని అనుకుంటున్నానని ప్రముఖ దర్శకుడు అడిగారని, కాళేశ్వరం నిర్మాణం పూర్తయ్యాక తీద్దామని కెసిఆర్ అన్నారని తెలియజేశారు. 2014, 2018లో ఒంటరిగా పోటీచేసి గెలిచామని, 2023 లోనూ ఒంటరిగానే పోటీచేసి చిన్నతేడాతో ఓడిపోయామని తెలియజేశారు. సిఎం రేవంత్ రెడ్డి సర్కార్, తెలంగాణను 25 ఏళ్ల వెనక్కినెట్టే పరిస్థితి తెచ్చిందని, ఇప్పుడు కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ వచ్చుడో.. కెసిఆర్ సచ్చుడో అనే నినాదంతో సాధించామని, జూన్ 2వ తేదీ కెసిఆర్ జీవితచరిత్రలో అతిపెద్దది అని



అన్నారు. దశాబ్దాల పోరాటం ఫలించిన రోజే జూన్ 2 అని తెలంగాణ కోసం ఎత్తిన జెండా దింపేది లేదని కెసిఆర్ చెప్పారని, పోరాటం మధ్యలో ఆపితే..రాళ్లతో కొట్టాలని కెసిఆర్ ధైర్యంగా చెప్పారని, పదవీత్యాగాలకే కాదు..ప్రాణత్యాగానికీ వెనుదీయని నేత కెసిఆర్ అని కొనియాడారు. 14 ఏళ్లు పోరాడి రాష్ట్రం సిద్ధించాక కెసిఆర్ చేతిలో ప్రజలు బాధ్యతలు పెట్టారని, పోరాట నాయకుడే పాలకుడైతే బాగుంటుందని ప్రజలు భావించారని, 2028 డిసెంబర్ లో కెసిఆర్ మళ్లీ సిఎం అవుతారని ప్రజలే చెప్తున్నారని కెటిఆర్ పేర్కొన్నారు. 2028 డిసెంబర్‌లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. నెత్తురు పారిన చోట సాగు నీళ్లు తీసుకువచ్చింది కేసీఆర్ అని తెలిపారు. లక్షా 65 వేల ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అని.. అల్పకులు ఏది పడితే అది మాట్లాడతారని మండిపడ్డారు. దేశమంతా కాంగ్రెస్‌ను వదిలించుకుందన్నారు. తెలంగాణను కాంగ్రెస్.. కుక్కలు చింపిన విస్తరిలా చేస్తోందని వ్యాఖ్యానించారు. రైతులు.. అధికారుల కాళ్లు పట్టుకునే దుస్థితి వచ్చిందన్నారు. కృష్ణా, గోదావరిని గురువుకు గురుదక్షిణగా రేవంత్ ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ.. అశోక్‌నగర్ వచ్చి చెప్పిన 2 లక్షల ఉద్యోగాలు ఎక్క? సెక్యూరిటీ లేకుండా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు బయటికి వస్తారా.? రైతుబంధు లేదు.. కానీ రాహుల్ గాంధీ బంధు టింగ్ టింగ్ అని వెళ్తోంది. తెలంగాణ తల్లి ఒడ్డాణం, కిరీటం ఎత్తుకుపోతున్నారు అంటూ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పుష్కర తెలంగాణ ఇప్పుడు ముష్కరుల పాలైందని వ్యాఖ్యానించారు. లివింగ్ లెజెండ్ కేసీఆర్... ఎత్తిన జెండా దించనని.. జెండా దించితే రాళ్లతో కొట్టిచంపమని అన్న ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక నోరుందని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

## పరస్పర సహకారంతోనే వికసిత్ భారత్ సాకారం

### ఢిల్లీలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:**'తెలంగాణ అనేది కేవలం ఒక సాధారణ రాష్ట్రం కాదని, దీని ఏర్పాటు వెనుక తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆత్మ గౌరవం, అసంఖ్యాక త్యాగాలతో కూడిన ఒక సుదీర్ఘ ఉద్యమం ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బిజెపి ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలం దరికీ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కి ఘన స్వాగతం పలికారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం సాగిన చారిత్రాత్మక ప్రజా ఉద్యమంలో ప్రాణా లర్పించిన అమరవీరులకు రాంచందర్ రావు ఘనంగా నివాళుల ర్పించారు. తెలంగాణ ఆకాంక్ష కోసం 1,200 మందికి పైగా యువకులు తమ ప్రాణాలను త్యాగం చేశారని, వారి సుదీర్ఘ పోరాటం మరియు బలిదానాల వల్లే దశాబ్దాల కల సాకారమైందని భావోద్వేగంగా పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రం ప్రజాస్వామ్య, పార్లమెంటరీ ప్రక్రియ ద్వారానే సిద్ధించిందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో భారతీయ జనతా పార్టీ పోషించిన కీలక పాత్రను గుర్తుచేశారు. పార్లమెంట్‌లో తెలంగాణ రాష్ట్ర డిమాండ్‌కు బేషరతుగా, అచంచలంగా మద్దతు పలికిన అప్పటి లోక్‌సభ ప్రతిపక్ష నేత, స్వర్గీయ సుష్మా స్వరాజ్‌కి రాంచందర్ రావు నివాళులర్పించారు. "అప్పట్లో సుష్మా స్వరాజ్ పార్లమెంట్‌లో తెలంగాణ కోసం బలంగా నిలబడకపోతే, తెలంగాణ గొంతు అంత శక్తివంతంగా వినిపించేది కాదన్నారు. తెలంగాణ ప్రజలు ఆమె చేసిన సహకారాన్ని ఎల్లప్పుడూ కృతజ్ఞతతో గుర్తుంచుకుంటారు" అని కొనియాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య ఉన్న సోదరభావాన్ని, బంధాన్ని ప్రస్తావిస్తూ రెండు రాష్ట్రాలు పరస్పర స్నేహంతో, ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీతో ముందుకు సాగాలని రాంచందర్‌రావు అభిప్రాయపడ్డారు. తెలుగు ప్రజలమైన మనకు రెండు రాష్ట్రాలు ఉన్నాయి. మన మధ్య ఎటువంటి ద్వేషాలు, విభేదాలు ఉండకూడదన్నారు. కేవలం అభివృద్ధిలో మాత్రమే ఆరోగ్యకరమైన పోటీ ఉండాలి. రెండు రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా పరస్పర స్నేహం, సంపూర్ణ సహకారం ఉంటేనే ఉభయ రాష్ట్రాలు ప్రగతి పథంలో ముందుకు దూసుకుపోగలవు. వికసిత్ తెలంగాణ-వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లు కలిసికట్టుగా అడుగులు వేసినప్పుడే వికసిత్ భారత్ స్వప్నం సాకారమవుతుందని ఆయన స్పష్టం చేశారు.

## సిడబ్ల్యుసిలోకి సిద్దరామయ్య

### నేడు కన్నడ సిఎంగా డికె ప్రమాణం, డిప్యూటీగా పరమేశ్వర ఒక్కరికే ఛాన్స్

**బెంగళూరు, జూన్ 2:** సీఎం పదవినుంచి వైదొలిగి తన డిప్యూటీ డికెశివకుమార్‌కు అవకాశం కల్పించిన కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్యకు కాంగ్రెస్ హైకమాండ్ పార్టీ అత్యున్నత నిర్ణాయక మండలిలో పదవినిచ్చింది. కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీలో ఆయన్ను నియమిస్తున్నట్లు ప్రకటించింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఈమేరకు అధికారికంగా ప్రకటించారు. పార్టీకి సంస్థాగతంగాను, రాజకీయ వ్యూహాలపై దిశా నిర్దేశంచేసే అత్యున్నత నిర్ణాయక కమిటీ వర్కింగ్‌కమిటీలో సిద్ధరామయ్య వంటి సీనియర్లు ఉండాలని హైకమాండ్ భావించిందని కెసివి తెలిపారు. అలాగే జాతీయ, రాష్ట్ర నాయకత్వాలమధ్య సమన్వయం కోసమే కర్ణాటకలో పార్టీ, ప్రభుత్వ సమన్వయం చేసుకునేందుకు ఈని



యమాకం జరిగిందని హైక మాండ్‌ప్రకటించింది. సిద్ధరామయ్యను సిడబ్ల్యుసిలోకి తీసుకురావడంద్వారా పార్టీని కర్ణాటకలో సంస్థాగతంగా ప్రక్షాళనచేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనియామకంతో ఇక సిద్ధరామయ్య జాతీయ స్థాయి పార్టీ క్రియాశీలక నేతగా వ్యవహరిస్తారు.

**నేడు సీఎంగా డికె ప్రమాణం:** ఇదిలా ఉంటే బుధవారం రాష్ట్ర సీఎంగా ప్రస్తుత డిప్యూటీ డికె శివకుమార్‌ప్రమాణం చేయనున్నారు. ఆయనచేత రామ్‌దాస్ అథవాలే ప్రమాణంచేయిస్తారు. శివకుమార్‌తోపాటే మరో పదిమందివరకూ కేబినెట మంత్రులు ప్రమాణం చేస్తారని చెపుతున్నారు. ఇప్పటికే ఎఐసిసి, పార్టీ అంతర్గత వ్యవహారాల విభాగం మంత్రుల పేర్లను ఖరారుచేసిందని తెలుస్తోంది. వీరిలో సీనియర్ మంత్రి సిద్దరామయ్య కేబినెట్‌లో కూడా పనిచేసిన దళితనేత జికెప రమేశ్వరకు డిప్యూటీసీఎం పదవి వరిస్తోందన్న ప్రచారం ఊపందుకుంది. నలుగురు డిప్యూటీలు ఉండాలన్న డిమాండ్‌ను డికె నిష్కర్షగా తిరస్కరించిన సంగతి తెలిసిందే. దీనితో దళితనేత సీనియర్‌నాయకుడు పరమేశ్వరను డిప్యూటీగా ఎంపికచేసిందని తెలుస్తోంది.

## ట్రాన్స్‌జెండర్ మహిళకు బ్రెస్ట్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స కోసం సిఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** రాష్ట్రంలో తొలిసారిగా ఒక ట్రాన్స్‌జెండర్ మహిళకు బ్రెస్ట్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి(చీఫ్ మినిస్టర్ రిలీఫ్ ఫండ్) నుంచి ఆర్థిక సహాయం అందించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఒక ట్రాన్స్‌జెండర్ మహిళ శస్త్రచికిత్స కోసం సిఎంఆర్‌ఎఫ్ కింద ఆర్థిక సహాయం అందించారు. తెలంగాణలో ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు అందరితో సమానమైన అవకాశాలు కల్పిస్తుండగా, తాజాగా ఆరోగ్య సేవలను కూడా అందుబాటులోకి తెచ్చి గౌరవప్రదంగా జీవించే హక్కులను మరింత బలోపేతం చేసే దిశగా మరో అడుగు పడిందని క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ పేర్కొంది. శస్త్రచికిత్స విజయవంతమైన నేపథ్యంలో క్వీర్ బంధు పేరెంట్స్ అసోసియేషన్ ఫౌండర్ ప్రెసిడెంట్ ఎం.



ముకంద మాల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఓఎస్‌డీ వేముల శ్రీనివాసులును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభ సందర్భంగా, ట్రాన్స్‌జెండర్ సమాజం సంక్షేమం, సాధికారత, సామాజిక సమగ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్‌లు, ఇతర ఎల్‌జిబిటిక్యూ సమాజ సభ్యుల సంక్షేమం కోసం, ముఖ్యంగా వారి ఆరోగ్య అవసరాల పరంగా, ప్రభుత్వం అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి ఇదివరకే ప్రకటించారు.

## వృద్ధురాలిపై లైంగిక దాడి: నిందితుడి అరెస్టు

**వనపర్తి, జూన్ 2, ప్రభాతవార్త:** వృద్ధురాలిపై లైంగిక దాడి చేసి చోరీకి పాల్పడిన నిందితుడిని అత్యంత వేగంగా గుర్తించి అరెస్టు చేయడం ద్వారా వనపర్తి పోలీసులు తమ విధి నిబద్ధతను మరోసారి నిరూ పించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారెవరైనా తప్పించుకోలేరనే సందేశాన్ని ఈ కేసు ద్వారా స్పష్టం చేస్తున్నామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, పేర్కొన్నారు.55 ఏండ్ల వృద్ధురాలిపై హత్యాచారం చేసి...చోరికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసి కోర్టు లో హాజరు పరుస్తున్నామని వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి తెలిపారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, మీడియాతో మాట్లాడారు. మే 30 వ తేదిన 55 ఏండ్ల వృద్ధురాలికి మాయమాటలు చెప్పి మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని...వనపర్తి రూరల్ స్టేషన్ పరిధిలోని శ్రీ మేధా టౌన్ షిప్ సమీపంలోని చెట్లపొదల్లోకి తీసుకెళ్లి నాపై లైంగిక దాడి చేసి, అనంతరం ఆభరణాలు, నగదు దొంగలించాడని ఓ వృద్ధురాలు రూరల్ పోలీసు స్టేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, సీఐ రత్నం నేతృత్వంలో ధర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పోలీసులు సీసీ టీ వీలు,మొబైల్ టవర్ లొకేషన్ వంటి సాంకేతికత సహాయంతో జోగలాంబ గద్వాల జిల్లా,గట్టు మండలం,ఆలూరు గ్రామానికి చెందిన నిందితుడు కుర్వ నవీన్(24) అదుపులోకి తీసుకొని విచారించారు.

## మమత 'తృణమూల్' కోటకు బీటలు

**కోల్‌కత్తా, జూన్ 2:** తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీ స్థాపించిన పార్టీ కోటలు కూలిపోతున్నాయి. టీఎంసీ ఎమ్మెల్యేల్లో మెజారిటీ ఎమ్మెల్యేలు తిరుగుబాటుకు రెడీ అయ్యారనే వార్తలు పరుగులు తీస్తున్నాయి. టీఎంసీ బహిష్కృత ఎమ్మెల్యే రిటబ్రత బెనర్జీ నాయకత్వంలో పార్టీని చేజిక్కించుకునేలా పావులు కదుపుతున్నట్లు వినికిడి. స్వయంగా మమతా బెనర్జీ సమావేశాలు పెట్టినా, ఎమ్మెల్యేలు రావడం లేదు. మంగళవారం కోల్‌కతాలో జరిగిన ధర్నాకు కేవలం 5 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు.

## వేలేరుపాడులో ఘోర అగ్ని ప్రమాదం: ఇద్దరు మహిళలు సజీవ దహనం

**వేలేరుపాడు,జూన్2 ప్రభాత వార్త:** వేలేరుపాడు మండలంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద సోమవారం రాత్రి ఒంటిగంట సమయంలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది.స్థానికంగా జరిగిన విషాదకర అగ్ని ప్రమాదంలో వలగాని సావిత్రి (60), సిగ పూలమ్మ (64)సజీవ దహనమై మృతి చెందారు. ప్రమాదం జరిగిన సమ యంలో మంటలు వేగంగా వ్యాపించడంతో నివాస గృహంతో పాటు అక్కాచెల్లెళ్లు అగ్నికి ఆహుతయ్యారు. గృహానికి ఆనుకొని ఉన్న లక్ష్మి నివాస గృహం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న గ్రామస్తులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు.అప్పటికే ఇద్దరు కాలి భూడిదైనట్లు గ్రామస్తులు గమనించారు. ప్రమాదం జరిగిన ఘటన స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, జరిగిన నష్టం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే వారికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు చెప్పడంతో సమగ్ర విచారణ నిర్వహిస్తామని చెప్పారు.

## మహారాష్ట్ర సిఎం అపాయింట్‌మెంట్ మేమిప్పిస్తాం

### 6 గ్యారంటీలు, వడ్ల కొనుగోలు అంశాలను పక్కదారి పట్టించేందుకు మహారాష్ట్ర సిఎంపై ఆరోపణలు:సంజయ్

**హైదరాబాద్, జూన్ 2 ప్రభాతవార్త:**రాష్ట్రంలో 6 గ్యారంటీలు, వడ్ల కొనుగోలు అంశంపై ప్రజలను పక్కదారి పట్టించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విబేధాలు సృష్టించి రాజకీయ లబ్ది పొందేందుకు ప్రయ త్నిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటులో ప్రధాన భూమిక పోషించింది బిజెపియే. తెలంగాణ బిల్లును పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన సమయంలో కెసిఆర్ కనీసం సభకు కూడా రాలేదు. తెలంగాణపై జరిగిన చర్చలో కూడా పాల్గొనలేదు. రాష్ట్రం ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వం దోచుకుంది. బిఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌కు అధికారం అప్పగిస్తే దారుణ పాలన చేస్తోంది. ఈ జనరేషన్ ట్రిపుల్ ఆర్ సినిమా మాత్రమే చూసిందే. కానీ ఓటేసిన పాపానికి ట్రిపుల్ సి సినిమా చూపిస్తుందన్నారు. అంటే కన్ఫ్యూజన్ ,కరప్షన్, కమీషన్ కాంగ్రెస్ దటీస్ ట్రిపుల్ సి. 6 గ్యారంటీల అమలులో ఘోరంగా విఫలమైన కాంగ్రెస్‌ను చూసి జనం అసహ్యించుకుంటున్నారన్నారు.

## ప్రారంభమైన జోసా కౌన్సెలింగ్

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్2:** దేశంలోని ఐఐటీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టే జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) కౌన్సెలింగ్ మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఈ నెల 13న మొదటి విడత సీట్ల కేటాయింపు చేపట్టనుండగా.. జులై 16న చివరివిడత సీట్ల కేటాయింపు చేపట్టి.. జులై 21తో కౌన్సెలింగ్ ప్రక్రియను ముగించనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను జేఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను నిర్వహించిన ఐఐటీ రూర్కీ ప్రకటించింది. మంగళవారం నుంచే జోసా కౌన్సెలింగ్‌ను ప్రారంభించారు. మొత్తం 23 ఐఐటీలతోపాటు ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో సీట్ల భర్తీకి జోసా కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించింది. ఐదు విడతల కౌన్సెలింగ్‌కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఐఐటీ రూర్కీ విడుదల చేసింది.

## 4, 6, 9, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** పాలనను ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు వీలుగా ఈ నెలలో నాలుగు కీలక తేదీలను ఖరారు చేశారు. ఈ నెల 4, 6, 9, 10 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో, వార్డుల్లో సభలు నిర్వహించనున్నారు. ఈ సభల్లో స్థానిక సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారు.

## రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్న కల్వకుంట్ల కవిత

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** రాష్ట్ర అవతరణ వేడుకల్లో కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. తెలంగాణ రక్షణసేన కార్యాలయంలో కవిత జాతీయ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిలియన్ మార్చ్‌ను తలపించేలా భూపోరాటం చేస్తామని, జులై 2 న ఉప్పల్ భగాయత్‌లో పెద్దఎత్తున భూపోరాటం చేస్తామని అన్నారు.

## అవమానాల అధ్యాయానికి ముగింపు పలికిన రోజు ఇది: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్2:** బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రజలకు మంగళవారం ఎక్స్ వేదికగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగాల చరిత్రకు న్యాయం జరిగినరోజు..అవమానాల అధ్యాయానికి ముగింపు పలికిన రోజు అని అన్నారు.

## ఇకపై వాట్సాప్‌కు ట్రాఫిక్ చలాన్లు

**హైదరాబాద్, ప్రభాతవార్త, జూన్2:**తెలంగాణ రాష్ట్రంలో ఇకపై ట్రాఫిక్ చలాన్లు వాట్సాప్ కూడా పంపించనున్నారు. వాట్సాప్ తోపాటు ఎస్ఎంఎస్ రూపంలో ఈ-మెయిల్స్ ద్వారా కూడా పంపించవచ్చని రవాణాశాఖ పేర్కొంది. ఇందు కోసం నెలరోజుల గడువును ఇస్తున్నట్టు రవాణా శాఖ జీవో ఎంఎస్ నంబర్ 25ను జారీ చేసింది.

# బిజెపికి అన్నామలై రాజీనామా!

## - నితిన్‌నబీన్‌కు లేఖ అందించిన తమిళనాడు బిజెపి మాజీ చీఫ్

## - హోంమంత్రి అమిత్‌షాతో కూడా భేటీ



**చెన్నై, జూన్ 2:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై సొంతంగా రాజకీయ వేదికను ఏర్పాటుచేసుకునేందుకు కసరత్తులు ముమ్మరంచేసారు. పార్టీలో తనకు తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో కొద్ది రోజులుగా ఆయన అసహనంతో రగిలిపోతున్న అన్నామలై మంగళవారం తన రాజీనామాలేఖను ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌ను కలిసి అందచేసారు. అనంతరం హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయి సుదీర్ఘచర్చలు జరిపారు. ఈ నేపథ్యంలో పార్టీలో తనకు అవకాశంగానీ, భవిష్యత్తుగానీ లేదని, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో సమావేశం అనంతరం రాజీనామా చేసే అవకాశం ఉందని అన్నామలై పేర్కొన్నారు. ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఒక్క సీటు గెలవని విషయం తెలిసిందే. ఆసక్తికరమైన విషయం ఏంటంటే విమానాశ్రయానికి ఆయన వచ్చిన వాహనంపై బీజేపీ జెండా లేదు. జూన్ 4న అన్నామలై పుట్టినరోజు కావడంతో కోయంబత్తూరు, మదురై నగరాల్లో ప్రధాన రహదారులు, వీధుల్లో అన్నామలై 2.0 అవతార్ మా నాయకుడు, రండి మమ్మల్ని నడిపించండి వంటి నినాదాలతో కూడిన పోస్టర్లను ఏర్పాటు చేశారు. అన్నామలైకు బీజేపీ రాజ్యసభ సీటును ఆఫర్ చేసినా ఆయన తిరస్కరించినట్లు తెలిసింది. తన భవిష్యత్తుపై చర్చించేందుకు ఢిల్లీ వెళ్లన అన్నామలై తనకు సమయం కేటాయించాల్సిందిగా అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కోరారు. ఈ పర్యటనలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కూడా మాజీ ఐపీఎస్ కలిసి తన రాజీనామా నిర్ణయాలను వివరించారు. తొలుత ఓ ఉద్యమాన్ని ప్రారంభించి, తర్వాత దానిని రాజకీయ వేదికగా మార్చాలనే ఉద్దేశంతో అన్నామలై ఉన్నట్లు తెలుస్తోంది. ఒకే రకమైన భావాలు గల వ్యక్తులను ఒకచోటకు చేర్చి, బలమైన స్వచ్ఛంద కార్యకర్తల నెట్‌వర్క్‌ను నిర్మించడమే దీని ఉద్దేశమని పలు వర్గాలు చెబుతున్నాయి. ఈ కొత్త ఉద్యమం విభిన్న వృత్తులు, సామాజిక నేపథ్యాల నుంచి స్వచ్ఛంద కార్యకర్తలను ఆకర్షించడానికి ప్రయత్నిస్తుందని భావిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ప్రేరణ పొందిన అన్నామలై 2020లో ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. ఆ పార్టీలో చేరిన వెంటనే తమిళనాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఏడాది ఎల్. మురుగన్ కేంద్ర ప్రభుత్వంలోకి వెళ్లడంతో తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పదోన్నతి పొందారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ద్రావిడ పార్టీల ఆధిపత్యంలో ఉన్న తమిళనాడులో అన్నామలై బీజేపీ ప్రాబల్యాన్ని గణనీయంగా పెంచారు. ఉద్ధృతమైన ప్రచారాలు, విస్తృతమైన క్షేత్రస్థాయి పర్యటనలు, సోషల్ మీడియా ద్వారా ఆయన పార్టీ సంస్థాగత విస్తరణకు సహాయపడటంతో పాటు, వ్యక్తిగతంగా అనుచర వర్గాన్ని కూడా నిర్మించుకున్నారు. కొన్నేళ్లుగా బీజేపీకి ఆదరణ పెరుగుతుండటంతో తమిళనాడు ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీ చేయాలని అన్నామలై భావించారు. బీజేపీ నాయకత్వం అన్నాడీఎంకేతో మళ్లీ పొత్తు పెట్టుకుంది. అధికార డీఎంకేకు వ్యతిరేకంగా ప్రతిపక్ష ఓట్లు చీలిపోకుండా వ్యూహాత్మక నిర్ణయంగా ఈ చర్యను చాలామంది భావించారు. చివరకు బీజేపీ నాయకత్వ మార్పుపై ఎడప్పాడి పళనిసామి పట్టుబట్టడంతో అన్నామలైను అధిష్ఠానం అధ్యక్ష పదవి నుంచి తొలగించింది. తర్వాత ఎన్నికల్లోనూ ఆయనకు పోటీచేసే అవకాశం కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలతో తీవ్రంగా కలతచెందిన అన్నామలై బీజేపీని వీడాలని నిర్ణయించుకున్నారు. అయితే పార్టీ హైకమాండ్ చర్చిస్తుందని, హోంమంత్రి అమిత్‌షాతో కూడా చర్చించిన తర్వాత రాజీనామాపై నిర్ణయం ప్రకటిస్తామని, అప్పటివరకు ఢిల్లీలోనే ఉండాలని పార్టీ చీఫ్ నితిన్ నబీన్ అన్నామలైకు స్పష్టంచేసినట్లు సమాచారం. ఇప్పటివరకు పరిణామాలుచూస్తే పార్టీచీఫ్ నితిన్‌నబీన్, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి బిఎల్‌సంతోష్‌లతో అన్నామలై విస్తృతచర్చలుజరిపినట్లు తేలింది.

# రెండోసారి కేబినెట్ విస్తరణకు సిద్ధమవుతున్న అసోం సీఎం



**గువాహతి, జూన్ 2:** అస్సాంలో వరుసగా రెండోసారి ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం ఏర్పాటైన నెల రోజుల్లోపే తన మంత్రివర్గాన్ని విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయాన్ని నేరుగా ఆయనే వెల్లడించారు. ముఖ్యంగా ఈనెల 5వ తేదీన రాష్ట్ర మంత్రి మండలి విస్తరణ జరగనుందని అధికారికంగా ప్రకటించారు. ఎనిమిది నుచి తొమ్మిది మందికి సీఎం శర్మ క్యాబినేట్‌లో చోటు దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. రాజకీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఈ విస్తరణలో కొత్తగా ఎనిమిది నుంచి తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు కేబినెట్ మంత్రులుగా అవకాశం దక్కుతుందని తెలుస్తోంది. ఈసారి శర్మ కేబినెట్‌లో పలు కొత్త ముఖాలు కొలువుదీరనున్నాట్లు సమాచారం. ముఖ్యంగా బరాక్ వ్యాలీ ప్రాంతం నుంచి కొత్త నాయకులకు మంత్రివర్గంలో స్థానం కల్పించనున్నారు. అలాగే ఎగువ అస్సాం ప్రాంతం నుంచి కూడా ఇద్దరు లేదా ముగ్గురు కొత్తవారిని చేర్చుకోనున్నారు. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తూనే యువ నాయకత్వానికి, కొత్త ముఖాలకు సమతూకం పాటించేలా సీఎం శర్మ కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. బీజేపీతో పాటు దాని మిత్రపక్షాలైన అస్సాం గణ పరిషత్ (ఏజీపీ), బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) నేతలకు కూడా ఈ విస్తరణలో తగిన ప్రాధాన్యత లభించనుంది. ఏప్రిల్ 9వ తేదీన జరిగిన అస్సాం అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) మూడోసారి వరుసగా అధికారాన్ని కైవసం చేసుకుంది. మొత్తం 126 స్థానాలకు గాను ఎన్డీయే కూటమి ఏకంగా 102 సీట్లు గెలుచుకుని క్లీన్ స్వీప్ చేసింది. ఇందులో బీజేపీయే ఒంటరిగానే 82 స్థానాలు సాధించగా మిత్రపక్షాలైన ఏజీపీ 10, బీపీఎఫ్ 10 స్థానాల్లో విజయం సాధించాయి. అనంతరం మే 12న ముఖ్యమంత్రిగా హిమంత బిశ్వ శర్మ ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రితో పాటు నలుగురు మంత్రులు మాత్రమే కేబినెట్‌లో ఉన్నారు. అందులో రామేశ్వర్ తేలి (ట్రాన్స్‌ఫార్మేషన్ అండ్ డెవలప్‌మెంట్), అతుల్ బోరా (పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి), చరణ్ బోరో (రవాణా శాఖ), అజంతా నియోగ్ (మహిళా, శిశు సంక్షేమ శాఖ) బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అస్సాం క్యాబినెట్ గరిష్టంగా 18 నుంచి 19 మంది వరకు మంత్రులు ఉండే అవకాశం ఉందని.. పార్టీ అధిష్ఠానంతో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని సీఎం గతంలోనే స్పష్టం చేశారు.

# నేను లేకుంటే జైల్లో ఉండేవాడివి.. పిచ్చిపట్టిందా?

## నెతన్యాహును హెచ్చరించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, జూన్ 2:** ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇద్దరి మధ్య నిన్న జరిగిన ఫోన్ సంభాషణ తీవ్ర వాదోపవాదాలకు దారితీసింది. లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేపడుతున్న సైనిక చర్యలు ఇరాన్‌తో అమెరికా జరుపుతున్న కీలక చర్చలకు ఆటంకం కలిగిస్తున్నాయని ట్రంప్ తీవ్రంగా మండిపడ్డారు. ఈ క్రమంలో నెతన్యాహుపై ట్రంప్ అత్యంత కఠినమైన, ఘాటైన పదజాలం ఉపయోగించారని అమెరికా అధికారులు వెల్లడించారు. ఈ సంభాషణ ఇరుదేశాల మధ్య సంబంధాల్లో ఉన్న ఉద్రిక్తతలను మరోసారి బయట పెట్టింది. నెతన్యాహుపై తన అసహనాన్ని ట్రంప్ దాచుకోలేక పోయారు. నీకు పిచ్చి పట్టిందా నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేను నిన్ను కాపాడుతున్నా. ఇప్పుడు నీ వల్ల ఇజ్రాయెల్‌ను కూడా అందరూ ద్వేషిస్తున్నారని ట్రంప్ అన్నట్టు అమెరికా అధికారి ఒకరు తెలిపారు. 'అసలు ఏం చేస్తున్నావ్ నువ్వు' అంటూ నెతన్యాహుపై ట్రంప్ గట్టిగా అరిచినట్టు ఆయన చెప్పారు. నేను గనుక మద్దతుగా నిలబడకపోతే నీ అవినీతి కేసుల విచారణలో ఎప్పుడో జైలు ఊచలు లెక్కబెడుతూ ఉండేవాడివి. నేనే నిన్ను ప్రతిసారీ కాపాడుకుంటూ వస్తున్నాను. నీ అనాలోచిత చర్యల వల్ల ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అందరూ నిన్ను, ఇజ్రాయెల్‌ను ద్వేషిస్తున్నారంటూ ట్రంప్ తీవ్ర పద జాలంతో హెచ్చరించినట్లు యాక్సియోస్ కథనం పేర్కొంది. ముఖ్యంగా లెబనాన్ రాజధాని బీరుట్‌ను టార్గెట్ చేస్తూ ఇజ్రాయెల్ చేస్తున్న హెచ్చరికలు, భవనాలను కూల్చివేసే వ్యూహాలపై ట్రంప్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకే ఒక్క హెజ్‌బొల్లా కమాండర్‌ను హతమార్చడం కోసం పెద్ద ఎత్తున భవనాలను కూల్చేస్తూ, అమాయక లెబనాన్ పౌరుల ప్రాణాలను బలితీసుకోవడం సరికాదని ట్రంప్ స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల ప్రపంచ దేశాల ముందు ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోతుందని హెచ్చరిస్తూ బీరుట్‌పై దాడుల ప్రణాళికకు బ్రేకులు వేశారు. ఇజ్రాయెల్ చర్యలు ఆ దేశాన్ని అంతర్జాతీయంగా ఏకాకిని చేస్తాయని, దౌత్యపరమైన ప్రయత్నాలను దెబ్బతీస్తాయని ట్రంప్ ఈ సందర్భంగా హెచ్చరించినట్లు సమాచారం. లెబనాన్‌లోని హెజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేయడం, ముఖ్యంగా బీరూట్ శివార్లలోకి సైనిక చర్యలు విస్తరించేందుకు సిద్ధమవ్వడంతో ఈ వివాదం ముదిరింది. ఇజ్రాయెల్ చర్యలను కారణంగా చూపుతూ అమెరికాతో పరోక్ష చర్చల నుంచి వైదొలుగుతామని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్‌తో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తగ్గించాలని ట్రంప్ నెతన్యాహు చర్యలను తన ప్రయత్నాలకు గండికొట్టేవిగా పరిగణించి ఆగ్రహం వెళ్లగక్కారు.

# ఎమ్మెల్యేల సంతకాల ఫోర్జరీ కేసులో అభిషేక్‌కు బిగుస్తున్న ఉచ్చు



**కోల్‌కత్తా,జూన్ 2:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సంబంధించిన సంతకాల ఫోర్జరీ ఆరోపణల కేసు దర్యాప్తు ముమ్మరం అయింది. ఈ కేసులో సీఐడీ దూకుడుగా వ్యవహరిస్తోంది. ఇప్పటివరకు 13 మంది ఎమ్మెల్యేల వాంగ్మూలాలను నమోదు చేసింది. ఈ వ్యవహారంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, లోక్ సభ సభ్యుడు అభిషేక్ బెనర్జీ ఆరోపణలను ఎదుర్కొంటోన్నారు. ఆయనకు సీఐడీ తాజాగా నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కేసు పశ్చిమ బెంగాల్ శాసనసభకు సమర్పించిన ఒక తీర్మానంలో జరిగిన అవకతవకల ఆరోపణల నుండి మొదలైంది. ప్రతిపక్ష నాయకుడిగా శోభందేబ్ ఛటోపాధ్యాయ్, ఉప ప్రతిపక్ష నాయకులుగా అసిమా పాత్రా, నయనా బంద్యోపాధ్యాయ్, చీఫ్ విప్‌గా ఫిర్హాద్ హాకీమ్‌లను నియమించేందుకు సంబంధించిన తీర్మానం ఇది. దీనిపై మే 6న నిర్వహించిన సమావేశంలో తాము సంతకాలు చేయలేదని ముగ్గురు శాసనసభ్యులు స్పష్టం చేసినట్లు సీఐడీ అధికారులు తెలిపారు. ఆ సంతకాలు తమవి కావని స్పష్టం చేశారని పేర్కొన్నారు. మే 9న తృణమూల్ కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో పార్టీ ఆఫీస్ బేరర్ల నియామకాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నట్లు అభిషేక్ బెనర్జీ శాసనసభ స్పీకర్‌కు తెలియజేశారు. తదనంతరం 18న శాసనసభ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీకి ఓ లేఖ రాశారు. శాసన సభాపక్ష సమావేశం మినిట్స్, అందులో చేసిన తీర్మానాలు, హాజరైన ఎమ్మెల్యేల సంతకాలను సమర్పించాల్సిందిగా కోరారు. దీంతో మే 20న అభిషేక్ బెనర్జీ మినిట్స్ ను అందజేశారు. మే 6న నిర్వహించిన సమావేశానికి 70 మంది ఎమ్మెల్యేలు హాజరైనట్లు పేర్కొన్నారు. వారి సంతకాల జాబితా కూడా ఇందులో ఉంది. 27న ఇద్దరు ఎమ్మెల్యేలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

## మమత ధర్నాకు ఐదుగురు ఎమ్మెల్యేలు హాజరు! - టిఎంసిలో ముదురుతున్న అంతర్గత సంక్షోభం

**న్యూఢిల్లీ, జూన్ 2:** తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీ ఎన్నికల్లో ఓటమి తర్వాత తొలిసారిగా భారీ ధర్నాలో పాల్గొన్నారు. మేనల్లుడు, డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి తర్వాత ఆమె బీజేపీకి వ్యతిరేకంగా ధర్నా చేశారు. బీజేపీని అధికారం నుంచి తొలగించే వరకు చావనని దీదీ అన్నారు. అయితే, కోల్‌కతాలో జరిగిన ఈ ధర్నాకు టీఎంసీ ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఇంత పెద్ద కార్యక్రమానికి మొత్తం 80 మంది ఎమ్మెల్యేలలో కేవలం 5 మంది మాత్రమే హాజరుకావడం మమతను షాక్‌కు గురిచేసింది. సీనియర్ శాసనసభ్యులు చంద్రమా భట్టాచార్య, శోభన్‌దేబ్ చటోపాధ్యాయ, నయన బంద్యోపాధ్యాయ, మదన్ మిత్రా, అశోక్ దేబ్, అషిమా పాత్రలతో సహా కేవలం ఆరుగురు ఎమ్మెల్యేలు మాత్రమే పాల్గొన్నారు. టీఎంసీ ఎంపీలు దోలా సేన్, కళ్యాణ్ బెనర్జీ, డెరెక్ ఓబ్రెయిన్ కూడా పాల్గొన్నారు. మొత్తం 29 మంది ఎంపీలకు గానూ కేవలం ముగ్గురు మాత్రమే వచ్చారు. అభిషేక్ బెనర్జీ దాడి తర్వాత, మమత తన ఇంట్లో ఎమ్మెల్యేల సమావేశానికి పిలుపునిస్తే 80 మంది ఎమ్మెల్యేలకు గానూ కేవలం 20 మంది వచ్చారు. ఇప్పుడు ఆ సంఖ్య 5కే పరిమితమైంది. తృణమూల్ కాంగ్రెస్‌లో సంక్షోభం తీవ్రమవుతుందని తెలుస్తోంది. రిటబ్రత బెనర్జీ నేతృత్వంలో ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేస్తారని ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుత'ున్నాడని ఆయనను మమతా బెనర్జీ బహిష్కరించారు. చాలా మంది ఎమ్మెల్యేలు రిటబ్రతతో టచ్‌లో ఉన్నారు. వీరంతా మమతా బెనర్జీ నుంచి పార్టీని చేజిక్కించుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం.

# సంక్షిప్తంగా..

## కేరళం డిప్యూటీ స్పీకర్‌గా షానిమోల్ ఉస్మాన్



**తిరువనంతపురం, జూన్ 2:** కేరళ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్‌గా కాంగ్రెస్ నేత షానిమోల్ ఉస్మాన్ ఎన్నికయ్యారు. ఎల్డీఎఫ్ అభ్యర్థి మొహమ్మద్ ముషిన్‌పై ఆమె గెలుపొందారు. షానిమోల్‌కు 99 ఓట్లు పోలయ్యాయి. ముషిన్‌కు 34 ఓట్లు పడ్డాయి. ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. స్పీకర్ తిరువంచూర్ రాధాకష్ణణ్ ఓటింగ్‌లో పాల్గొన్నలేదు. కేరళ అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పోస్టుకు ఎన్నికైన నాలుగవ మహిళగా ఆమె రికార్డు నెలకొల్పారు. కేఓ అయేషా బాయ్, నఫీసాత్ బీవీ, భార్గవి థంకప్పన్ గతంలో డిప్యూటీ స్పీకర్లుగా చేశారు. తాజాగా జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యూడీఎఫ్ కూటమికి 102 సీట్లు వచ్చిన విషయం తెలిసిందే.

## ఐయోవాలో కాల్పులు- ఒకే కుటుంబంలో ఏడుగురు మృతి

ఐయోవా, జూన్ 2: అమెరికాలో మరోసారి కాల్పుల కలకలం రేగింది. ఐయోవాలోని మస్కటిన్ టౌన్ తూపాకీ తూటాలతో రక్తమోడింది. ఈ కాల్పుల ఘటనలో ఏడుగురు మృతిచెందారు. మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. వారితోపాటు కాల్పులకు పాల్పడిన వ్యక్తి కూడా మరణించాడు. తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా ఈ కాల్పులు జరిగినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఘటనపై మస్కటిన్ పోలీస్ డిపార్ట్‌మెంట్ ప్రకటన చేసింది.

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో కాల్పుల ఘటన చోటుచేసుకుంది.

## వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు భారత్ పర్యటన

**న్యూఢిల్లీ, జూన్ 2:** వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ఈనెల 3 నుండి 7 వరకు భారతదేశంలో పర్యటించనున్నారని విదేశాంగ మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. భారత్‌లో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ బిగ్ క్యాట్స్ అలయన్స్ సదస్సులో పాల్గొనాల్సి ఉంది. ఈ సదస్సు వాయిదాపడింది. రోడ్రిగ్జ్‌తో పాటు పలువురు మంత్రులతో కూడిన ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ఈ పర్యటనలో భాగం కానుంది. ఆమెతో పాటు విదేశాంగ, ఆర్థిక, శాస్త్ర సాంకేతిక, సమాచార, రవాణా శాఖల మంత్రులతో సహా పలువురు మంత్రులు కూడా ఉంటారని విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ చెప్పారు. రోడ్రిగ్జ్‌కు భారత్‌తో చాలా ఏళ్లుగా సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

## 33 యేళ్ల హత్యాయత్నం కేసులో 84 యేళ్ల వ్యక్తికి శిక్ష

**పాట్నా, జూన్ 2:** భారత న్యాయవ్యవస్థ లో ఉన్న జాప్యానికి ఈకేసు ఒక ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తుంది. బీహార్ లో 33 ఏళ్ల క్రితం నమోదైన ఓ హత్యాయత్నం కేసులో 84 ఏళ్ల వృద్ధుడిని స్థానిక కోర్టు దోషిగా తేల్చింది. ఈ సుదీర్ఘ విచారణ, తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యాయి. 1992 నవంబర్ 10న బీహార్ లోని వైశాలి జిల్లా రాఘవ్‌పూర్ గ్రామంలో దీప్ రాయ్ అనే వ్యక్తి, అతని అనుచరులు కలిసి అదాలత్ రాయ్ అనే వ్యక్తి ఇంటి ముందు పగిలిన గాజు ముక్కలు పడేశారు. దీనిపై అదాలత్ రాయ్, ఆయన భార్య ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలో ఆయుధాలు, తుపాకులతో పరస్పరం దాడులు చేసుకున్నారు. దాంతో దీప్‌రాయ్, అతని నలుగురు అనుచరులపై అదాలత్ రాయ్ హత్యాయత్నం కేసు పెట్టారు. ఈ కేసులో 1993 మార్చిలో పోలీసులు చార్జిషీట్ దాఖలు చేయగా 1999లో అభియోగాలు నమోదు చేశారు.

## నీట్ పేపర్ లీక్.. నిందితుడి నివాసంపై బుల్డోజర్!

**న్యూఢిల్లీ, జూన్ 2:** నీట్,యూజీ పేపర్ లీకేజీ కేసులో ప్రధాన సూత్రధారిగా ఉన్న రిటైర్డ్ ప్రొఫెసర్ పివి కులకర్ణి నివాసంపై మహారాష్ట్ర మున్సిపల్ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బీడ్ జిల్లాలోని ఆయన ఇంటిని నిబంధనలకు అతిక్రమించి నిర్మిస్తున్నట్లు గుర్తించిన అధికారులు దాని తొలగింపునకు నోటీసులు జారీ చేశారు. అనంతరం బుల్డోజర్‌తో నిర్మాణంలో ఉన్న అక్రమ భాగాలను తొలగించే పనిలో పడ్డారు. పివి కులకర్ణి బీడ్‌లోని షాహునగర్‌లో గతంలో తన పూర్వీకులు ఉన్న ఇంటిస్థలంలో నాలుగంతస్తుల భవనాన్ని నిర్మిస్తున్నాడు. ఇటీవల పేపర్‌లీక్ వ్యవహారం వెలుగు చూసిన నేపథ్యంలో ఆ కట్టడంపై స్థానిక మునిసిపల్ అధికారులు దృష్టి సారించారు. సర్వే నిర్వహించగా అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశారు. మే 3న జరిగిన నీట్ పరీక్ష పేపర్ లీకైనట్లు ఆరోపణలు రావడంతో సమీక్షించిన ఎన్‌టిఎ మే 12న పరీక్షను రద్దు చేస్తున్నట్లు చెప్పారు.

# నెహ్రూను దాటి మోడీ ముందుకు!

## 9వ తేదీకి ప్రధానిగా 4,398 రోజులు పూర్తి



**న్యూఢిల్లీ, జూన్ 2:** ప్రధాని మోడీ మరో అరుదైన రికార్డు నమోదుచేస్తున్నారు. చరిత్రలో కనీవినీ ఎరుగని రికార్డ్‌ను సొంతం చేసుకోబోతున్నారు. మరో ఏడు రోజుల్లో దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మీద నెలకొన్న రికార్డును ప్రధాని బ్రేక్‌చేయనున్నారు. వరుసగా అత్యధిక కాలం ప్రధానమంత్రిగా కొనసాగిన నెహ్రూ రికార్డ్‌ను మోడీ అధిగమించనున్నారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఏకధాటిగా 4397 రోజుల పాటు అనగా 12 సంవత్సరాల 14 రోజుల పాటు ప్రధానిగా పని చేశారు. ఇప్పుడు ఆ రికార్డ్‌ను ప్రధాని మోడీ ఈనెల 9న అధిగమించనున్నారు. ఈనెల తొమ్మిదో తేదీనాటికి 4,398 రోజుల పాటు వరుసగా అత్యధిక కాలం ప్రధానమంత్రిగా పనిచేసిన జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును మోడీ సొంతం చేసుకోబోతున్నారు. జూన్ 9న మూడవ పర్యాయం రెండేళ్ల పూర్తికానున్నాయి. ఈ చారిత్రాత్మక ఘనత సాధించినందుకు ప్రధాని మోడీని అభినందిస్తూ ఈనెల 10న ఎన్డీఏ ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. ఈ సందర్భంగా ఒక తీర్మానాన్ని ఆమోదించనున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇతర మిత్రపక్షాల నాయకులు ఈ తీర్మానానికి మద్దతు తెలపనున్నారు. ప్రధానమంత్రిగా గడిచిన పన్నెండేళ్లలో సాధించిన విజయాలను ఈ తీర్మానం ప్రముఖంగా హైలెట్ చేయనుంది. భారతదేశ తొలి ప్రధానమంత్రిగా జవహర్‌లాల్ నెహ్రూ 1952 మే 13న తొలిసారిగా ఎన్నికైన ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆనాటి నుంచి ప్రధానమంత్రిగా వరుసగా 4,397 రోజులు అంటే 12 సంవత్సరాల 14 రోజులు పనిచేశారు. వాస్తవానికి నెహ్రూ 1947 ఆగస్టు 15న ప్రధానమంత్రి అయినప్పటికీ తొలి లోక్‌సభ ఎన్నికల వరకు ప్రధానిగా కాకుండా మధ్యంతర ప్రభుత్వానికి అధిపతిగా పని చేశారు. 1964 మే 27న మరణించే వరకు ప్రధానమంత్రిగా కొనసాగారు. ఈ పూర్తి పదవీ కాలాన్ని కలిపితే 6,130 రోజులవుతాయి. కానీ ఇందులో మధ్యంతర ప్రభుత్వానికి పని చేసిన 1,733 రోజులు ఉన్నాయి. ఈ మొత్తం కలిపితే 6,130 రోజులవుతాయి. కానీ అధికారికంగా ప్రధానిగా ఎన్నికైన తర్వాత మాత్రం 4,397 రోజులలే. అంటే 12 సంవత్సరాల 14 రోజులు పనిచేశారు. ఇక ప్రధాని మోడీ పేరిట అనేక రికార్డ్‌లు ఉన్నాయి. అత్యధిక కాలం ప్రధానమంత్రిగా పని చేసిన తొలి కాంగ్రెసేతర వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఇక వాజ్‌పేయ్ పేరిట ఉన్న 2,272 రోజుల రికార్డ్‌ను అధిగమించారు. వరుసగా మూడు ఎన్నికల్లో గెలిచిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా మోడీనే కావడం విశేషం. ఇప్పుడు 2014లో ప్రధానిగా ఎన్నికైన దగ్గర నుంచి ఏకధాటిగా పని చేసిన రికార్డ్‌ను ఇప్పుడు సొంతం చేసుకోబోతున్నారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. అప్పటి నుంచి నిరంతరాయంగా ప్రభుత్వ అధినేతగా పని చేస్తున్నారు. 2001 అక్టోబర్ 7 నుంచి 2014 మే 22 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పని చేశారు. అనంతరం 2014 మే 26 నుంచి ఇప్పటి వరకు ప్రధానమంత్రిగా పని చేస్తున్నారు. ఈ విధంగా మోడీ ఎన్నికైన ప్రభుత్వాలకు అధినేతగా మొత్తం తొమ్మిదివేల రోజులు పూర్తి చేశారు. దేశ చరిత్రలో ఇలాంటి రికార్డ్ ఎవరికీ లేనిరికార్డు ప్రస్తుతం మోడీకి మాత్రమే సొంతం.

# కారుణ్య నియామకాలకు వివాహిత కుమార్తెలూ అర్హులే!

- సర్వోన్నత న్యాయస్థానం విస్పష్ట తీర్పు
- అలహాబాద్ హైకోర్టు అభిప్రాయాన్ని తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 2:** కారుణ్య నియామకాలకు సంబంధించిన ప్రధానంగా తల్లిదండ్రులపై ఆధారపడి జీవిస్తున్న వివాహిత కుమార్తెలకు సుప్రీం కోర్టు భారీ ఊరట నిచ్చే తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ ఉద్యోగి సర్వీసులో ఉండగా మరణిస్తే ఆ స్థానంలో ఇచ్చే కారుణ్య నియామకాలకు వివాహిత కుమార్తెలు కూడా అర్హులేనని స్పష్టం చేసింది. కేవలం పెళ్లి అయిందనే కారణంతో మహిళల హక్కులను కాలరాయలేరని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. కారుణ్య నియామకం విషయంలో 'కుటుంబం' అనే నిర్వచనంలోకి వివాహిత కుమార్తెలు రారని పేర్కొన్న అలహాబాద్ హైకోర్టు తీర్పులను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ అలోక్ అరధేలతో కూడిన ధర్మాసనం, అర్హత ఉన్న కుమార్తెకు సంక్షేమ పథకాన్ని నిరాకరించడానికి వైవాహిక స్థితి సరైన కారణంగా నిలవదని పేర్కొన్న బాంబే హైకోర్టు, కర్ణాటక హైకోర్టుల తీర్పులతో తాము ఏకీభవిస్తున్నామని పేర్కొంది. వివాహిత కుమారులకు ఎలాంటి అసమర్థత లేనప్పుడు, వివాహిత కుమార్తెల కారుణ్య నియామకాల క్లెయిమ్‌లను తిరస్కరించవచ్చా అనే విషయంపై అలహాబాద్ హైకోర్టు సింగిల్ జడ్జి సుప్రీంకోర్టును ప్రస్తావించడంతో ఈ కేసు తలెత్తింది. ఈ కేసులో, పిటిషనర్ అయిన ఒక వివాహిత కుమార్తె, కారుణ్య ప్రాతిపదికన ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్‌గా లైసెన్స్ కోసం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు.


## చీలిక దిశగా మమత పార్టీ.. బెంగాల్ మంత్రి తపస్‌రాయ్!

**కోల్‌కతా, జూన్2:** తృణమూల్ కాంగ్రెస్ రెండుగా చీలడానికి సిద్ధంగా ఉందని పశ్చిమ బెంగాల్ మంత్రి తపస్ రాయ్ వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో కనిపించిన పరిస్థితులే ఇక్కడా రానున్నాయన్నారు. ఆ రాష్ట్రంలో శివసేన పార్టీ రెండు ముక్కలైన సంగతి తెలిసిందే. పార్టీ గుర్తు విషయంలోనూ వివాదం నడిచింది. దానిని ఉద్దేశించే మంత్రి మీడియాతో మాట్లాడారు. రాజకీయంగా పెద్దగా ప్రాధాన్యం లేనివారికి టిఎంసి చోటు కల్పించిందని అందుకే ఇప్పుడు పార్టీలో అంతర్గతంగా నెలకొన్న అసంతృప్తి బయటపడుతోందన్నారు.

# అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 30 మంది ట్రక్కు డ్రైవర్ల అరెస్టు!

**వాషింగ్టన్,జూన్ 2:** అగ్రరాజ్యం అమెరికాలో అక్రమ వలసదారులపై ట్రంప్ యంత్రాంగం నిఘాను తీవ్రం చేసింది. నిబంధనలను ఉల్లంఘించి చట్టవిరుద్ధంగా దేశంలో నివాసం ఉంటున్న వారిని ఏరివేసే ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే అమెరికాలో కమర్షియల్ ట్రక్కులు నడుపుతూ జీవనం సాగిస్తున్న 30 మంది భారతీయులను యూఎస్ సరిహద్దు రక్షణ విభాగాలు అరెస్ట్ చేశాయి. చట్టవిరుద్ధంగా దేశంలో ఉంటున్నందుకు గానూ వీరిని త్వరలోనే అమెరికా నుంచి స్వదేశానికి పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ భారీ అరెస్టులకు సంబంధించిన వివరాలను యూఎస్ కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ ఒక అధికారిక ప్రకటన ద్వారా బహిర్గతం చేసింది. అమెరికా రహదారులపై వాణిజ్య అవసరాల కోసం తిరిగే పెద్ద పెద్ద సెమీ ట్రక్కులను నడుపుతూ దేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న వారిని టార్గెట్ చేస్తూ యూఎస్ బోర్డర్ పెట్రోల్ విభాగం ఒక ప్రత్యేక నిఘా చర్యను చేపట్టింది. అందులో భాగంగానే గత నెలలో ఆరిజోనా రాష్ట్రంలోని యూమా సెక్టార్‌కు చెందిన సరిహద్దు రక్షణ ఏజెంట్లు ఆపరేషన్ చెక్‌మేట్ పేరుతో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో భాగంగా అమెరికా వ్యాప్తంగా చట్టవిరుద్ధంగా సంచరిస్తున్న మొత్తం 52 మందిని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరిని లోతుగా విచారించగా అందులో 36 మంది సెమీ ట్రక్కులను నడిపే ప్రొఫెషనల్ డ్రైవర్లుగా తేలింది. ఈ 36 మంది డ్రైవర్లలో అత్యధికంగా 30 మంది భారత దేశానికి చెందినవారే కావడం గమనార్హం. కాగా మిగిలిన ఆరుగురు డ్రైవర్లు మెక్సికో, ఎల్ సాల్వడార్, రష్యా దేశాలకు చెందిన వలసదారులుగా అధికారులు గుర్తించారు. లైసెన్సులు ఉన్నా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో చాలా మంది వద్ద అమెరికాలోని కాలిఫోర్నియా, న్యూయార్క్, వాషింగ్టన్, వర్జీనియా వంటి వివిధ రాష్ట్రాల నుంచి పొందిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌లు ఉన్నాయి.

కొంతమంది వద్ద కనీసం ఎలాంటి లైసెన్సులు కూడా లేవని దర్యాప్తులో తేలింది. డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉన్నప్పటికీ వారు దేశంలో నివసించడానికి అవసరమైన లీగల్ వీసా లేదా ఇమ్మిగ్రేషన్ పత్రాలు లేకపోవడంతో వారందరినీ అక్రమ వలసదారులుగానే పరిగణించారు. ప్రస్తుతం వీరందరిపై అమెరికా ఫెడరల్ చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తీసుకున్నారు. చట్టపరమైన ప్రక్రియ ముగిసిన వెంటనే ఈ 30 మంది భారతీయ డ్రైవర్లను దేశం నుంచి వెలివేయనున్నారు.



# ఉక్రెయిన్ రాజధానిపై రష్యా భీకర దాడులు

**కీవ్,జూన్ 2:** మిస్సైళ్లు, డ్రోన్లతో ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రాత్రివేళల్లో రష్యా భీకర దాడులు చేసింది. కీవ్‌తో పాటు మరిన్ని నగరాలపై దాడులు జరిగాయి. ఆ దాడుల్లో సుమారు 9 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. బిల్డింగ్ శిథిలాల కింద అనేక మంది చిక్కుకున్నట్లు తెలుస్తోంది. సుమారు 29 మంది గాయపడినట్లు సమాచారం ఉంది. కీవ్‌లో రెసిడెన్షియల్ బిల్డింగ్‌లు డ్యామేజ్ అయ్యాయి. కొన్ని పాక్షికంగా కూలిపోయాయి. దీంతో ఆ శిథిలాల్లో స్థానికులు చిక్కుకున్నారు. కీవ్‌లో అనేక జిల్లాల్లో ఆ దాడులు ప్రభావం చూపినట్లు సైనిక అధికారి తైమూర్ తాచెంకో తెలిపారు. దిన్రోలో అయిదుగురు మృతి చెందారు. అక్కడ 25 మంది గాయ పడ్డారు. కీవ్‌లో నలుగురు మృతిచెందారు. 51 మంది గాయపడ్డారు. రెండు బహుళ అంతస్థుల భవనాలు దెబ్బతిన్నాయని కీవ్ మేయర్ విటాలీ క్లిచ్‌కోవ్ తెలిపారు. తెల్లవారుజాము వరకు కీవ్‌పై రష్యా దాడులు కొనసాగించింది.

